teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 135 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 10 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## వీడని వాయుగుండం ప్రభావం

రాష్ట్రంలో ఈనెల 12 వరకు భారీ వర్షాలు



.. వివరాలు 2లో

## రైల్వేస్టేషన్, చర్లపల్లి టెర్మినల్ రోడ్ల విస్తరణకు సహకరించాలి



### సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, చర్లపల్లి టెర్మినల్ రోడ్ల విస్తరణకు సహకారం అందించాలని కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభోత్సవానికి మోడీ వస్తారు. వీలైనంత త్వరగా రోడ్లను పూర్తిచేయాలని

మిగతా 2 లో



## పల్లెల్లో పడకేసిన వైద్యం



### గ్రామాల్లో ఆస్పత్రులు, డాక్టర్లకు కొరత

వైద్య సిబ్బంది సంఖ్య కూడా అంతంతే

జనాభాకు తగ్గట్లుగా లేని దవాఖానాలు

రూరల్ హెల్త్ స్టాటిస్టిక్స్‌లో కేంద్రం వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): : మన రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయని తేలింది. పల్లె ప్రజలకు వైద్యులు పెద్దగా అందుబాటులో లేరని వెల్లడైంది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవల వివరాలపై కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ 'హెల్త్ డైనమిక్

మిగతా 2 లో



## గ్రీన్ ఫార్మా సిటీ ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చ

### వేగవంత చర్యలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్ శివారులోని గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో సీఎంతో పాటు పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి గ్రీన్ ఫార్మా సిటీ ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ముచ్చర్ల ప్రాంతంలో ఇప్పటికే ఎంపిక చేసిన పరిసరాల్లో గ్రీన్ ఫార్మా సిటీని అద్భుతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉ పయోగించుకోవాలని

మిగతా 2 లో

## రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు

మిగతా 2 లో

## అసెంబ్లీలో మూడు కమిటీల ప్రకటన

### చైర్మన్, సభ్యుల జాబితా బులెటెన్ విడుదల చేసిన స్పీకర్



.. వివరాలు 2లో




## నగర పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి

### మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తాం

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల సమస్యలపై పోరుపై దృష్టి సారించిందని, మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు, నేరస్థులతో కఠినంగా వ్యవహరిస్తామని ఆయన పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీలో నగర పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆనంద్ మాట్లాడుతూ రెండోసారి పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్‌పై సీరియస్‌గా ఉంది. మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తాం అని ఆనంద్, నేరస్థులను కఠినంగా ఎదుర్కొంటామని చెప్పారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆనంద్ డిసెంబర్ 2021 నుంచి అక్టోబర్ 2023 వరకు హైదరాబాద్ సీపీగా

మిగతా 2 లో



## ఈసారి కూడా హుస్సేన్ సాగర్లో వినాయక నిమజ్జనాలు..?

### వినాయక నిమజ్జనాలపై మరోసారి హైకోర్టులో పిటిషన్

### హైడ్రా కమిషనర్ ను ప్రతివాదిగా చేర్చిన పిటిషనర్

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): హుస్సేన్ సాగర్లో వినాయక నిమజ్జనాలపై మ-రోసారి హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గత ఏడాది హుస్సేన్ సాగర్లో నిమజ్జనాలు చేయరాదంటూ హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. కాగా ఆ తీర్పును ఈ ఏడాది కూడా

మిగతా 2 లో

## ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు తీర్పును స్వాగతించిన హరీష్ రావు



### మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యం:హరీష్ రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక విధానాలకు చెంపపెట్టు అని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యమన్నారు. తెలంగాణ

మిగతా 2 లో




## దోస్త్ స్పెషల్ డ్రైవ్ అడ్మిషన్స్ షెడ్యూల్‌లో మార్పులు


### ఈ నెల 11 వరకు రిజిస్ట్రేషన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో వర్షాలు, వరదల నేపథ్యంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) స్పెషల్ డ్రైవ్

మిగతా 2 లో

## న్యూఢిల్లీలో 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

### రైల్వేల సేవలకు జీఎస్టీ వర్తించదని కౌన్సిల్ సిఫార్సు



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): న్యూఢిల్లీలో 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించారు. న్యూఢిల్లీలో 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

మిగతా 2 లో

## రైల్వేస్టేషన్, చర్లపల్లి టెర్మినల్ రోడ్ల విస్తరణకు సహకరించాలి

మొదటి పేజీ తరువాయి

కోరారు. కాగా, ఇటీవల తెలంగాణలో కేంద్ర రైల్వేశాఖ సహాయ రన్విత్ సింగ్ బిట్టు పర్యటించిన విషయం తెలిసిందే. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, చర్లపల్లి టెర్మినల్ రోడ్ల విస్తరణకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రూ.700కోట్ల వ్యయంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నిర్మాణ పనులు 2026 నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యమని చెప్పారు.

## రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి

భద్రతా నిబంధనలు పాటించి, భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఎవరైనా ర్యాష్ డ్రైవింగ్ చేసినా, రాంగ్ రూట్‌లో వచ్చి ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించినా, ఓవర్ టేకింగ్ చేసినా, బైక్ మీద ట్రిపుల్ రైడింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీస్ విభాగాన్ని మంత్రి ఆదేశించారు. అంతేకాకుండా డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాలు, సిగ్నల్ జంపింగ్ వంటి విషయాల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిబంధనలను కఠినంగా రూపొందిస్తామన్నారు. సోమవారం ఉదయం లక్డీకపూల్ లోని రవాణాశాఖ సాంకేతిక అధికారులతో మంత్రి పొన్నం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

## అసెంబ్లీలో మూడు కమిటీల ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీలో మూడు కమిటీలను నియమించారు. అందుకు సంబంధించిన బులెటెన్ ను సోమవారం అసెంబ్లీ సెక్రటరీ నరసింహాచార్యులు విడుదల చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, అంచనాల కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీలను ప్రకటించారు. పీఏసీ కమిటీకి చైర్మన్‌గా ప్రతిపక్ష ఎమ్మెల్యేను నియమించారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా అరికపూడి గాంధీ, సభ్యులుగా వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, రేవూరి ప్రకాశ్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రామారావు పవర్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కూనంనేని సాంబశివరావు, టి. జీవన్ రెడ్డి, భానుప్రసాద్ రావు, ఎల్.రమణ, సత్యవతి రాథోడ్ ను నియమించారు. అంచనాల కమిటీ చైర్ పర్సన్‌గా ఉత్తమ్ పద్మావతిరెడ్డి, సభ్యులుగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాగంటి గోపీనాథ్, సీహెచ్ విజయ-రమణారావు, కోరం కనకయ్య, రాందాసు మాలోతు, మామిడాల యశస్విని, పి. రాకేష్ రెడ్డి, ఎంఎస్ ప్రభాకర్ రావు, సుంకరి రాజు, టి. రవీందర్ రావు, వి. యాదవరెడ్డిని నియమించారు. అదే విధంగా పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్‌గా వీర్లపల్లి శంకర్, సభ్యులుగా పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, పట్లోళ్ల సంజీవరెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, కౌసర్ మోహినోద్దీన్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శేరి శుభాష్ రెడ్డి, తోట మధుసూదన్, మీరజ్ రియాజుల్ హాసన్ ఎఫెండీలను నియమిస్తూ స్పీకర్ బులెటెన్ విడుదల చేశారు.

## ఈసారి కూడా హుస్సేన్ సాగర్లో వినాయక నిమజ్జనాలు..?

మొదటి పేజీ తరువాయి

కొనసాగించాలంటూ హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలైంది. హైదరాబాద్ లో చెరువుల పరిరక్షణకు ఏర్పాటైన హైడ్రా దీనిపై బాధ్యతలు తీసుకోవాలంటూ హైడ్రా కమిషనర్ ను ప్రతివాదిగా చేర్చారు పిటిషనర్. ఈ పిటిషన్ పై నేడు వాదనలు జరుగనున్నాయి అని హైకోర్ట్ తెలిపింది. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, అనేక రసాయనాలు కలిసిన రంగులతో తయారు చేయబడిన వేలకొద్ది వినాయక విగ్రహాలు హుస్సేన్ సాగర్లో నిమజ్జనం చేయడం వల్ల సాగర్ అధికంగా కలుషితం అవుతుందని హుస్సేన్ సాగర్లో వినాయక నిమజ్జనాలు చేయరాదంటూ గత ఏడాది హైకోర్టు తీర్పు వెల్లడించింది. మరి ఈ ఏడాది వినాయక నిమజ్జనాలు హుస్సేన్ సాగర్లో ఉంటాయో లేదో అనేది ఈరోజు కోర్టులో తెలనుంది.

## నగర పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి

మొదటి పేజీ తరువాయి

పనిచేశారు. తెలంగాణ కేడర్‌కు చెందిన సీవీ ఆనంద్ 2017లో అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి పొంది కేంద్ర సర్వీసులకు వెళ్లి 2021లో తెలంగాణకు తిరిగొచ్చారు. 2023 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2023 ఎన్నికల సమయంలో ఆయనను సీపీ పదవి నుంచి తప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆనంద్‌కు ఏసీబీ డీజీగా బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు మళ్లీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

## ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు తీర్పును స్వాగతించిన హరీష్ రావు

మొదటి పేజీ తరువాయి

హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమన్నారు. అనర్హత కారణంగా ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ తప్పకుండా గెలుస్తుందన్నారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర శాసన సభాపతి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని ఆశిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు.

# పల్లెల్లో పడకేసిన వైద్యం



మొదటి పేజీ తరువాయి

ఆఫ్ ఇండియా 2022-23' వార్షిక నివేదికను సోమవారం విడుదల చేసింది. దీనినే రూరల్ హెల్త్ స్టాటిస్టిక్స్‌గా పిలుస్తారు. ఈ నివేదిక ప్రకారం తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ) 63 శాతం మంది వైద్యులే పనిచేసున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో(సీహెచ్‌సీ) 52 శాతమే స్పెషాలిటీ వైద్యులున్నారు. అలాగే జనాభాకు తగినట్లుగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు లేవు.

రూరల్ హెల్త్ స్టాటిస్టిక్స్‌లోని ముఖ్యాంశాలు

తెలంగాణలో 11,226 గ్రామాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 4,228 సబ్ సెంటర్లు ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో 712 ఉన్నాయి. పల్లెల్లో 594 పీహెచ్‌సీలు ఉండగా అందులో 757 మంది డాక్టర్లు, 1,134 మంది నర్సులు పనిచేస్తున్నారు. పట్టణాల్లోని 275 పీహెచ్‌సీల్లో 299 మంది వైద్యులు, 517 మంది నర్సులు సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 29 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 57 ఉన్నాయి. 42 సబ్ డివిజన్ ఆస్పత్రులు, 6 జిల్లా ఆస్పత్రులు,

- 9 వైద్య కళాశాలలు ఉన్నాయి.
- గ్రామీణ ప్రాంతాల్లోని 594 పీహెచ్‌సీల్లో 1,188 మంది వైద్యులుండాలి. కానీ 757 మందే ఉన్నారు. 431 ఖాళీలున్నాయి. 29 సీహెచ్‌సీల్లో 116 మంది స్పెషలిస్టు వైద్యులు అవసరం ఉండగా.. 61 పోస్టులనే మంజూరు చేశారు. ఉన్న వాటిలో ప్రస్తుతం 37 మందే పనిచేస్తున్నారు. 79 ఖాళీలున్నాయి. ఒక్కో సీహెచ్‌సీలో ఒక రేడియోగ్రాఫర్ అవసరం ఉండగా.. 18 ఖాళీలున్నాయి. 683 ఫార్మసిస్ట్ శాంక్షన్డ్ పోస్టులకు 523 మందే పనిచేస్తున్నారు. 159 ఖాళీలున్నాయి. ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులు 677 ఉండగా.. 461 మందే పనిచేస్తున్నారు. 216 ఖాళీలున్నాయి. స్టాఫ్‌నర్స్ పోస్టులు 1,739 ఉండగా.. 1,377 మందే సేవలందిస్తున్నారు.
- రాష్ట్రంలో 2022లో 578 పీహెచ్‌సీలుండగా.. 2023 నాటికి అవి 594కు పెరిగాయి. 2022లో 802 మంది డాక్టర్లు ఉండగా.. గతేడాది ఆ సంఖ్య 757కు తగ్గింది. సీహెచ్‌సీల్లో స్పెషలిస్టుల సంఖ్య 98 నుంచి 37కు పడిపోయింది. జాతీయ స్థాయిలో పల్లె పీహెచ్‌సీల్లో పని చేసే వైద్యుల సంఖ్య 30,640 నుంచి 32,901కు పెరిగింది..
- తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో 2023 నాటికి సుమారు 2.70 కోట్ల మంది ఉంటారని అంచనా. ఆ మేరకు 708 పీహెచ్‌సీలు అవసరం కాగా, 114 కేంద్రాల కొరత ఉంది. 177 సామాజిక ఆరోగ్య కేంద్రాలు అవసరం కాగా, 29 ఉన్నాయి.
- గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో 427 శాంక్షన్డ్ ఏఎన్ఎమ్ పోస్టులుండగా.. 167 మందే పనిచేస్తున్నారు. 1,188 శాంక్షన్డ్ డాక్టర్ పోస్టులకు గాను 757 మందే పనిచేస్తున్నారు. 431 ఖాళీలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్ వైద్యులు 871 మంది అవసరం కాగా 659 మందే ఉన్నారు.
- రాష్ట్రంలోని 4,228 సబ్ సెంటర్లలో 2216 మంది ఏఎన్ఎమ్‌లు పనిచేస్తున్నారు. 52 శాతం మేర కొరత ఉంది.
- తెలంగాణలో ప్రతీ 4,705 మందికి ఒక సబ్‌సెంటర్ ఉంది. కేరళలో ఆ సంఖ్య 719గా ఉంది. అలాగే మన రాష్ట్రంలో ప్రతీ 33,488 మందికి ఒక పీహెచ్‌సీ.. ప్రతీ 6,85,931 మందికి ఒక సీహెచ్‌సీ ఉంది. దేశంలోనే అత్యధిక జనాభాకు ఒక సీహెచ్‌సీ ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. వాస్తవానికి అతితక్కువ జనాభాకు ఒక సీహెచ్‌సీ ఉన్న రాష్ట్రం కేరళ. అక్కడ ప్రతీ 40,720 మందికి ఒక సీహెచ్‌సీ ఉంది.

## గ్రీన్ ఫార్మా సిటీ ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చ



మొదటి పేజీ తరువాయి

చెప్పారు. పర్యావరణహితంగా కాలుష్య రహితంగా ఉండేలా గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిశ్రమల అభివృద్ధి జరగాలన్నారు. అక్కడ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీలు, మౌలిక సదు-పాయాల నిర్మాణాలను వీలైనంత తొందరగా చేపట్టాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని, వాటికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు ఉండాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని పనులు చేయాలని సూచించారు. గ్రీన్ ఫార్మా సిటీలో పెట్టుబడులకు ఇప్పటికే పేరొందిన ఫార్మా కంపెనీలు ముందుకు వస్తున్నాయని, త్వరలోనే ఆ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతామని సీఎం తెలిపారు. ఔషధాల తయారీ కంపెనీలు, బయోటెక్ అండ్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు కొత్తగా నెలకొల్పే అత్యాధునిక గ్రీన్ ఫార్మా సిటీ సింగిల్ స్టాప్‌గా ఉండాలని అభిప్రాయపడ్డారు. యాంటీ బయాటిక్స్, ఫెర్మంటేషన్ ఉత్పత్తులు, సింథటిక్ డ్రగ్స్, రసాయనాలు, విటమిన్లు, వ్యాక్సిన్లు, డ్రగ్ ఫార్ములేషన్స్, న్యూట్రాస్యూటికల్స్, హెర్బల్ ఔషధ ఉత్పత్తులు, ప్రత్యేక రసాయనాలు, కాస్మోటిక్స్ తదితర సంబంధిత ఉత్పత్తులన్నింటికీ ఫార్మా సిటీలో ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. పరిశోధన, శిక్షణ, నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విశ్వ విద్యాలయం ఉంటుందని అన్నారు. హెల్త్ కేర్, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అందులో కోర్సులు నిర్వహించాలని సూచించారు.

## బెంగాల్ వైద్యులు 5గంటల్లోపు విధుల్లో చేరాలి

### ఆదేశించిన దేశ అత్యున్నత న్యాయస్థానం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసుపై నిరసన చేస్తున్న బెంగాల్ వైద్యులు మంగళవారం సాయంత్రం 5గంటల్లోపు తిరిగి విధుల్లో చేరాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. లేకపోతే ప్రతికూల చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చింది. హత్యాచారం కేసుపై చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పశ్చిమ బెంగాల్‌లో 28రోజులుగా డాక్టర్లు సమ్మె చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. బెంగాల్ డాక్టర్లు తమ నిరసన విరమించాలని చంద్రచూడ్ మరోసారి కోరారు. ఈ సందర్భంగా వారి భద్రతకు హామీ ఉంటుందన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు వైద్యులు విధుల్లో చేరితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ వైద్యులు విధుల్లోకి రాకపోతే వారిపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని చెప్పింది.



## న్యూఢిల్లీలో 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

మొదటి పేజీ తరువాయి

జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన చివరి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఉక్కు, ఇనుము, అల్యూమినియం పాల క్యాన్లపై ఏకరీతిగా 12 శాతం జీఎస్టీని సిఫార్సు చేసింది. ప్లాట్ ఫారమ్ టిక్కెట్ల అమ్మకం, రిటైరింగ్ రూమ్‌లు మరియు వెయిటింగ్ రూమ్‌ల సౌకర్యం మరియు బ్యాటరీతో నడిచే కార్ సేవలతో సహా సామాన్యులకు భారతీయ రైల్వేలు అందించే సేవలకు ఎటువంటి జీఎస్టీ వర్తించదని కౌన్సిల్ సిఫార్సు చేసింది.

## వీడని వాయుగుండం ప్రభావం



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో ఈనెల 12 వరకు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురు-స్తున్నాయని, ఆ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది. అలాగే మంగళవారం కూడా ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. బుధ, గురువారం వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## దోస్త్ స్పెషల్ డ్రైవ్ అడ్మిషన్స్ షెడ్యూల్‌లో మార్పులు

మొదటి పేజీ తరువాయి

అడ్మిషన్స్ షెడ్యూల్‌లో అధికారులు మార్పులు చేశారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేనలు సోమవారం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. అర్హత గల విద్యార్థులు రూ.400 చెల్లించి ఈ నెల 11 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 11వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. ఈ నెల 10న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చేపడతారు. ఈ నెల 12న సీట్లను కేటాయిస్తారు. సీట్లు వచ్చిన వారు ఈ నెల 16 వరకు సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయడంతో పాటు, నేరుగా సీటు వచ్చిన కాలేజీల్లోను రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# మళ్లీ మొదటికొచ్చిన మణిపూర్

కుకీ, మెయితీ తెగల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలు కాస్తా గతేడాది ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌ను ఏ విధంగా రణరంగంగా మార్చాయో అందరికీ తెలిసిందే. వందల మంది ప్రాణాలు కోల్పోగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఎన్నో దారుణ ఘటనలు చోటు చేసుకున్నాయి. అయితే గత కొంత కాలంగా మణిపూర్‌లో డ్రోన్ దాడులు సంచలనం సృష్టించగా.. తాజాగా జరిగిన ఓ ఘటన మళ్లీ హింసాత్మక ఘటనలకు ఆజ్యం పోశాయి. తాజాగా జిరిబం జిల్లాలో శనివారం ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న కాల్పుల్లో మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. గత వారం రోజులుగా మణిపూర్‌లో హింస చెలరేగుతుండటం మరోసారి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జిరిబం జిల్లాకు సమీపంలో ఉన్న ఓ ఇంట్లో చొరబడిన మిలిటెంట్లు.. గాఢనిద్రలో ఉన్న ఓ వ్యక్తిని కాల్చి చంపేశారు. అనంతరం విషయం తెలుసుకుని పోలీసులు రంగంలోకి దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య భీకర కాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో ముగ్గురు మిలిటెంట్లతో పాటు ఓ సాధారణ పౌరుడు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. చురాచాంద్‌పుర్‌లో మిలిటెంట్లకు చెందిన 3 బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. ఇక ఇటీవల బిష్ణుపూర్ జిల్లాలో రాకెట్ దాడులను చురాచాంద్‌పూర్ నుంచే చేపట్టినట్లు తెలుస్తోంది. కొత్త తరహా దాడులతో రెచ్చిపోతున్నారు కుకీ తీవ్రవాదులు . డ్రోన్లు , రాకెట్ దాడులతో రాజధాని ఇంఫాల్ లోని ప్రముఖ నాయకుల ఇళ్లను వాళ్లు టార్గెట్ చేయడం తీవ్ర కలకలం రేపింది. వెంటనే అప్రమత్తమైన సైన్యం యాంటీ డ్రోన్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసింది. కేంద్రం మణిపూర్‌లో తాజా పరిస్థితిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి నివేదికలు తెప్పించుకుంటోంది. డ్రోన్లు , రాకెట్‌లను వాళ్లు ప్రయోగించడం తీవ్ర కలకలం రేపుతోంది. కుకీ, మెయితీ తెగల మధ్య చోటు చేసుకున్న ఘర్షణల కారణంగా మణిపూర్‌లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. డ్రోన్ దాడులకు కుకీ తీవ్రవాదులే కారణమని మెయితీ వర్గం ఆరోపిస్తోంది. సరిగ్గా పదహారు నెలల క్రితం మణిపూర్ మంటల్లో రగిలిపోయింది. గతేడాది మే 3న చెలరేగిన అల్లర్లు దాదాపు సంవత్సరం పాటు తీవ్రమైన ఆందోళనకు కారణమయ్యాయి. కొన్ని రోజులు ఈ పరిస్థితులు కాస్త సద్దుమణిగాయని అనుకుంటున్న తరుణంలో.. మణిపూర్ అంతర్యుద్ధం కాస్తా యుద్ధంగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ఉక్రెయిన్–రష్యా, ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో మాదిరి డ్రోన్లతో రాకెట్ దాడులకు తెగబడుతున్నారు మిలిటెంట్లు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాకు సమీపంలోని రెండు ప్రదేశాల్లో జనావాసాలపై బాంబులు వేయడానికి ఉగ్రవాదులు డ్రోన్‌లను ఉపయోగించారు. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతంలో రాత్రుళ్లు అందరూ లైట్లు ఆఫ్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం మణిపూర్‌లోని బిష్ణుపూర్, ఇంఫాల్ తూర్పు జిల్లాల శివార్లలోని నివాసితులు డ్రోన్‌ల దాడులకు భయపడుతూ బతుకుతున్నారు. సెప్టెంబర్ 6న బిష్ణుపూర్ జిల్లాలో మిలిటెంటు లాంగ్ రేంజ్ రాకెట్‌లను మోహరించారు. మణిపూర్ మొదటి ముఖ్యమంత్రి మైరెంబమ్ కోయిరెంగ్ నివాసంపై రాకెట్ దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో ఒక సీనియర్ సిటిజన్ ప్రాణాలు కోల్పోగా.. బిష్ణుపూర్ జిల్లా మొయిరాంగ్ ఖోయిరు లైకైలో ఆరుగురు పౌరులు గాయపడ్డారు. కొండ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించేందుకు పోలీసు బృందాలు, అదనపు భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. ముల్సాంగ్ గ్రామంలో రెండు బంకర్‌లు, చురచంద్‌పూర్‌లోని లైకా ముల్సౌ గ్రామంలో ఒక బంకర్‌ను భద్రతా బలగాలు ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. అక్కడ ఎస్పీతో సహా బిష్ణుపూర్ జిల్లా పోలీసు బృందాలు అనుమానిత కుకీ మిలిటెంట్లు కాల్పులు జరిపిన ప్రాంతానికి చేరుకున్నాయి. అయితే, పోలీసు బృందం గట్టిగా ప్రతిఘటించి దాడిని తిప్పికొట్టినట్లు అధికారులు చెబుతున్నారు. డ్రోన్లతో జరిగే దాడులను అడ్డుకోడానికి భారత వైమానిక పెట్రోలింగ్‌కి చెందిన మిలటరీ హెలికాప్టర్‌ను మోహరించారు. శాంతిభద్రతలను పరిశీలించేందుకు ఉన్నత స్థాయి భద్రతా సమావేశాలు నిర్వహిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న అధికారులు, ఎలాంటి ఆకస్మిక పరిస్థితులు తలెత్తినా స్పందించేందుకు అవసరమైన ప్రత్యేక బలగాలను సిద్ధం చేస్తున్నారు. మణిపూర్‌లో భారీ మిలిటెంట్ సమూహాల కదలికలపై నిఘా ఉంచడానికి భద్రతా బలగాలు హై అలర్ట్‌ను ప్రకటించాయి. బిష్ణుపూర్ జిల్లాలో, ఆకాశంలోకి లైటింగ్ రౌండ్లు కాల్పులు జరుపుతున్నారు. యుద్ధాన్ని తలపించే ఈ పరిస్థితికి ప్రజలు భయాందోళనలకు గురౌతున్నారు. ఈ గందరగోళం మధ్య భద్రతా బలగాలు కాల్పులు జరిపారా లేదంటే మిలిటెంట్లు కాల్పులు జరుపుతున్నారో తెలియక ప్రజలంతా బిక్కు బిక్కుమంటున్నారు. మరోవైపు, భద్రతా బలగాలు మిలిటెంట్ల బంకర్లను ధ్వంసం చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే, మణిపూర్‌లో డ్రోన్ ఆయుధాన్ని ఉపయోగించిన మొదటి సంఘటన సెప్టెంబర్ 1న ఇంఫాల్ పశ్చిమ జిల్లా కౌత్రుక్ గ్రామంలో జరిగింది. ఈ దాడిలో మిలిటెంట్లు తుపాకులు కూడా ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ఆ తర్వాత రోజు, దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సెంజామ్ చిరాంగ్‌లో మరో డ్రోన్ దాడి జరగ్గా ఇందులో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఇలా వరుస దాడులతో మణిపూర్ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే, మణిపూర్‌లో డ్రోన్లు ఎగరడం ఇటీవల కాలం షారామూమూలు అయ్యింది. కుకీ–జో తెగలు, మెజారిటీ మైతేయిల మధ్య గతేడాది వివాదం మొదలైనప్పటి నుండీ కెమేరా డ్రోన్లు ఎగురుతుండటం కనిపిస్తూనే ఉంది. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించడానికి అధికారులతో పాటు.. యూట్యూబర్లు కూడా డ్రోన్ కెమేరాలను వినియోగిస్తున్నారు. భద్రతా దళాల నిఘా డ్రోన్లు కూడా తిరుగుతూనే ఉన్నాయి. అయితే, ఇప్పుడు డ్రోన్లతో లాంగ్ రేంజ్ రాకెట్లతో గ్రెనేడ్లను వదలడం ఆందోళన కలిగిస్తోంది. కుకీ చొరబాటుదార్లు వీటిని ప్రయోగిస్తున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. కుకీ తెగలు నివాసముండే ప్రాంతాల నుండి ఈ డ్రోన్లు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# ఆర్టిఐ చట్టం అవగాహన సదస్సు కరపత్రాలు విడుదల

♦ సెప్టెంబర్ 30న సదస్సును విజయవంతం చేద్దాం



ఆత్మకూర్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎల్లిగండ్ల వెంకటేష్ ముదిరాజ్ ఆత్మకూరు మండల అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలో



సెప్టెంబర్ 30వ తేదీన సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తరఫున నిర్వహించబోయే సమాచార హక్కు చట్టం – 2005 అవగాహన సదస్సు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆత్మకూరు మండల తహసిల్దార్ రాజు, ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఇట్టి అవగాహన సదస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఇట్టి కార్యక్రమంలో వనపర్తి జిల్లా సభ్యులు బోరెల్లి రాము, నరేందర్, నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ మాతృభాష దినోత్సవం

♦ శ్రీవాణి హైస్కూల్ ఆధ్వర్యంలో వేడుకలు



ఆత్మకూర్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని శ్రీవాణి హైస్కూల్లో సోమవారం రోజు తెలంగాణ మాతృభాష దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకోవడం జరిగింది అని పాఠశాల



ప్రధానోపాధ్యాయులు గంగాధర్ లతా తెలిపారు. అనంతరం విద్యార్థులు కంఠస్థ పద్యాలు,నీతి పద్యాలు నాటక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు అభిలాష, రాఘవేంద్ర, వెంకటేష్, గంగాధర్, సునీత, స్వర్ణ, స్వాతి, పరమేష్, మహేందర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసరంలో సమయానికి ఆస్పత్రికి చేరుకునేదెలా..?

- నరకానికి కేరాఫ్ అడ్రస్ ప్రాజెక్టు రోడ్లు
- మరమ్మత్తుకు నోచుకోని రోడ్లు
- సిపిఎం మండల కార్యదర్శి వెంకట్రాములు

దేవరకద్ర, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): రామన్ పాడు ప్రాజెక్టు వంతెన మీదుగా ఆత్మకూరు వెళ్లే రహదారికి మరమ్మత్తులు చేపట్టాలని, రోడ్లపై నీళ్లు బురద ఉండడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రయాణికులు ప్రమాదాలకు గురి అవుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని రామన్ పాడ్ ప్రాజెక్టు రోడ్లను సోమవారం పార్టీ నాయకులతో కలిసి గుంతల మయమైన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మదనపురం మండల కేంద్రం సమీపంలోని ఊకశెట్టి వాగు పై ఉన్న మినీ బ్రిడ్జి సరళ సాగర్, శంకర సముద్రం వరద నీటితో మునిగిపోవడంతో వనపర్తి జిల్లా కేంద్రం నుండి ఆత్మకూరు అమరచింత మండలాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వనపర్తి జిల్లా కేంద్రం నుండి ఆత్మకూరు అమరచింత మండలాలకు వెళ్లాలంటే ప్రయాణికులు రామన్ పాడ్ జలాశయ వంతెన మీదుగా ప్రైవేటు



వాహనాలలో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఆ రహదారి పూర్తిగా గుంతలమయమై వర్షపు నీటితో నిండుకుందని ఎక్కడ గుంత ఉందో ప్రయాణికులకు తెలియని పరిస్థితి ఉందన్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఊకశెట్టి వాగు ఉప్పొంగిన ప్రతిసారి ఆత్మకూరు అమరచింత మండలాల ప్రజలకు ఈ దారే ప్రత్యామ్నాయంగా ఉందన్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రహదారికి మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చెన్నయ్య, వెంకటేష్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# సివ్యా నాయక్ గండిని నూతన బ్రిడ్జిగాతక్షణమే నిర్మించాలి

**సర్వారం సోసైటీ చైర్మన్ వీరం రెడ్డి శంబిరెడ్డి**

గరిడేపల్లి, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): గరిడేపల్లి మండలం కలమల చెరువు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గంగానగర్ ఆవాస గ్రామమైన సివ్య నాయక్ గండినీ రైతులుసౌకర్యార్థం కొరుకు తక్షణమే నిర్మించాలని సర్వారం సొసైటీసంఘం చైర్మన్ వీరం రెడ్డి, శంబీ రెడ్డి అన్నారు. ఈరోజు స్థానిక రైతులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 10 లక్షలతో లచ్చి కుంటా బ్రిడ్జిని ఎలా అయితే నిర్మించారు అలా తక్షణమే సీవ్య నాయక్ గండిని నిర్మించాలని వారు ఆ ప్రాంత రైతులతో మాట్లాడి ప్రభుత్వాన్ని స్థానిక మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డిని స్థానిక పార్టీ నాయకులు కలిసివారితో మాట్లాడి ఈ ప్రాంత గిరిజన తదితర రైతులకు న్యాయం చేయాలని వారుఅన్నారు వర్షాకాలం వస్తే ఈ ప్రాంత రైతులు చాలా ఇబ్బందులు పడతారని గండి దాటాలంటే అనేకమైన భయాందోళనలో గిరిజన రైతులు గురవుతారని గతంలో ఒకసారి కూడా గిరిజన రైతులు కొట్టుకుపోయి ప్రమాదానికి గురి అయ్యారనికాంగ్రెస్ ప్రభుత్వం ఈ



ప్రాంత గిరిజన రైతుల సౌకర్యార్థం కొరకు నూతన బ్రిడ్జిని నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా వరద వల్ల ఈ గండి కింద కొట్టుకుపోయిన వరి పొలాలను పరిశీలనచేసి ఆ ప్రాంత రైతులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట్రామ్ నాయక్ నరేందర్ నాయక్ మాజీ విద్యా కమిటీ చైర్మన్ బచ్చలకూరి కోటయ్య స్థానిక రైతులు బానోతు లచ్చి రామ్ నాయక్ ఒంటెద్దు అచ్చిత్ రెడ్డి అంజిరెడ్డి వెంకట్ రెడ్డి సంపూ నాయక్ వీరు మన్ని స్థానిక రైతులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాకవి కాళోజి నారాయణ జయంతి

నేరేడుచర్ల, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): "పద్మ విభూషణ్" "తెలంగాణ వైతాళికుడు" ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి మహోత్సవాన్ని "తెలంగాణభాష దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలలను వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాషకు యాసకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చినటువంటి మహోన్నతవ్యక్తి కవిగాయకుడు కాళోజి అని కొనియాడారు. పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిది అనేది కాళోజీ జీవితానికి సరిపోతుందని కొనియాడారు. నా గొడవ రచన ద్వారా ప్రజల సమస్యలను తన సమస్యగా భావించి సమాజాన్ని చైతన్య పరిచిన గొప్ప



అభ్యుదయవాది కాళోజీ అని ప్రధానోపాధ్యాయులు బట్టు మధు కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్ ఖాన్, నరసింహారావు, మాధవి, నాగమణి, అర్జున్, వెంకటేశ్వర్లు భానుమతి, బికోజి, రామమూర్తి, బాలు శ్రీనివాస్ రెడ్డి, లాల్ సాహెబ్, విజయలక్ష్మి, సరస్వతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఖమ్మం వరద బాధితులకు ఆర్థిక సాయం



నేరేడుచర్ల, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఖమ్మం జిల్లాలో ఖమ్మం టౌన్ ప్రకాష్ నగర్ వరద బాధితులకు వసూలు చేసినా ఫోన్ పే గూగుల్ పే ద్వారా వచ్చినటువంటి అమౌంట్ ని ఖమ్మం లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుమారుడు తుమ్మల యుగేందర్ ని కలిసి ఫోన్ పే గూగుల్ పే ద్వారా వచ్చినటువంటి 30 వేల రూపాయలను ఖమ్మంలో మినిస్టర్ ఆఫీస్ లో, ప్రకాష్ నగర్ కౌన్సిలర్ కొప్పెర ఉపేందర్ కలిసి ఇవ్వడం జరిగింది. పలుగులు మాట్లాడుతూ ఖమ్మం వరద బాధితులకు సాయం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు. పేరబోయిన యామిని వీరయ్య, యారవ సురేష్ , దొంతి రెడ్డి వెంకటరమణారెడ్డి, ఈగల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నాగారం, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు గోకుల్ కాలనీ లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 10 లక్షలతో చేపట్టుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి అధిక నిధులు కేటాయిస్తూ, అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. ఈ కార్యక్రమములో వైస్ చైర్మన్ బండారి మల్లేశ్ యాదవ్, స్థానిక కౌన్సిలర్ గోక కళావతి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



దేవరకద్ర, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా మదనాపురం మండలం శంకరంపేట గ్రామంలో బదిలీపై వెళ్తున్న ప్రాథమిక పాఠశాలలో జలంధర్ రెడ్డి మరియు గ్రామ పంచాయతీ సెక్రెటరీ లక్ష్మీనారాయణకి స్థానిక గ్రామస్తులు పి.కృష్ణయ్య, శ్రావణ్, కృష్ణ ,మాజీ సర్పంచ్ పద్మమ్మ,ఉప సర్పంచ్ కృష్ణయ్య మరియు గ్రామస్తులందరూ కూడా ఈ కార్యక్రమం పాఠశాలలో ఏర్పాటు చేసి వీడ్కోలు తెలిపారు. అనంతరం, వాళ్లు గ్రామస్తులంతా కలిసి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులందరూ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కారు లో అక్రమంగా తరలిస్తున్న గంజాయి

భద్రాద్రి కొత్తగూడెం: జూలూరుపాడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్సై రాణా ప్రతాప్, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ ప్రవీణ్ తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. పట్టుబడిన కారు, ద్విచక్ర వాహనాన్ని స్టేషన్కు తరలించి పోలీసులు విచారించారు. కారులో 246 కేజీల గంజాయిని సీలేరు నుండి హైదరాబాద్ కు తరలిస్తున్నట్లు నిందితులు విచారణలో వెల్లడించినట్టు కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు 80 లక్షల ఉంటుందని డిఎస్పి తెలిపారు. పట్టుబడ్డ నిందితులు బూర్గంపాడు మండలం సారపాక కు చెందిన శివశంకర్ రెడ్డి, నాగేంద్రబాబుగా గుర్తించడం జరిగిందన్నారు. నిందితుల్లో ఒకరైన శివ శంకర్ రెడ్డి పై గతంలో పాల్వంచ టౌన్, భద్రాచలం పోలీస్ స్టేషన్, బూర్గంపాడు పోలీస్ స్టేషన్, మలక్పేట్ పోలీస్ స్టేషన్, మోతుగూడెం పోలీస్ స్టేషన్ లతోపాటు మహారాష్ట్రలోని లాతూర్ పోలీస్ స్టేషన్లో ఆరు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నట్టు డిఎస్పి వెల్లడించారు. ఇతను గంజాయి పై అక్రమంగా కూడగట్టిన ఆస్తులను సైతం స్వాధీనం చేసుకోనున్నట్లు డిఎస్పీ తెలిపారు. గంజాయి అమ్మిన సేవించిన చట్టరీత్యా నేరమని అలా ఎవరైనా గంజాయి విక్రయానికి పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని డి.ఎస్.పి సూచించారు. ఈ కేసులో ఎంతో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న జూలూరుపాడు ఎస్సై టాస్క్ఫోర్స్ సిఐ మరియు ఎస్ఐలకు రివార్డు అందిస్తున్నట్లు డిఎస్పి వెల్లడించారు..

# మూలమల్ల గ్రామానికి బీటీ రోడ్డు వెయ్యాలి

**– ఆత్మకూర్ తాసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా**



ఆత్మకూర్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఆత్మకూర్ నుండి మూలమల్ల గ్రామం మీదుగా పీజెపి జూరాల డ్యాం వరకు బీటీ రోడ్డు వేయాలని, మరియు మూలమల్ల చిన్నతత్వ చెరువు అలుగు దగ్గర నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, మరియు చిన్నాకత్వ చెరువులో గల ముసళ్ళబారి నుండి ప్రజలకు రక్షణ కల్పించాలని, ఆత్మకూరు నుండి మూలమల్ల మీదుగా గద్వాల డిపో బస్సును గద్వాల్ వరకు నడపాలని, మరియు ములమల్ల నుండి అమరచింత వరకు బీటీ రోడ్డు వేయాలని, సిపిఐ పార్టీ ఆత్మకూర్ మండల సహాయ కార్యదర్శి కేమోష డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి కే విజయరాములు మాట్లాడుతూ మూలమల్ల గ్రామం చుట్టూ ఒకవైపు పీజెపి కాలువలు, మరొకవైపు కృష్ణానది, మరొకవైపు పీ జె పి డ్యాం, చుట్టూ నీళ్లతో నిండి రోడ్లన్నీ బురద మయంగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. లోయర్ జూరాల యందు నీటి నిల్వ చేసినప్పుడు మూలమల్ల గ్రామ వ్యవసాయ భూములు, మరియు గ్రామం ముంపునకు గురైన పట్టించుకోవడం లేదన్నారు తక్షణమే పై సమస్యలన్నీ పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రాబట్టు, శ్రీహరి, ఎం భీమన్న, కే గోవర్ధన్, బాలకృష్ణ, బాలరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కే ఆదాం, దుర్గన్న, రంగన్న, లక్ష్మన్న, నర్సింలు, రాములు, సువన్న, మణిగిల్ల, కురుమన్న, సి రాములు, మునెప్ప, జంగం రంగన్న, మూలమల్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సామాజిక తనిఖీలో పలు సమస్యలు పరిష్కరించాలి



ఆత్మకూరు సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్):–వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనకి ప్రజావేదిక ఏపీడి కార్యక్రమం నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏపీడి కి సామాజిక తనిఖీలు జరిగిన సమస్యలను తప్పిదాలను సరిచేసి తదుపరి సమస్యలను పరిష్కరిం చాలని కార్మిక సంఘం పని ప్రదేశం కి వెళ్లి సమగ్ర విచారణ చేయుట జరిగిందని ఇప్పుడు జరుగుతున్న సామాజిక తనిఖీల్లో అనేక ఆరోపణ లు అక్రమాలు తప్పిదాలు బాధ్యుల నిర్లక్ష్యం పనిలోపాలు మా దృష్టికి వచ్చిన సమస్యలను మీ దృష్టికి తెలియపరుస్తున్నామని వీటి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏపీడికి అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు

**అన్నదాన కార్యక్రమం**

అమరచింత సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్):–వినాయక చవితి ఉత్సవాలు అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలోని బీసీ కాలనీలోని జై గణేష్ వినాయక మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ వాసి సునీత తిరుపతి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ నాయకులు పోసిరి గారి విష్ణు మాజీ ఎంపీటీసీ తిరుమలేష్ హనుమంతు నాయక్ తెలుగు





రవికాంత్ ప్రారంభించారు. ప్రత్యేకంగా జై గణేష్ మండపానికి గజ మాలను రాష్ట్ర కలుగీత డిపార్ట్మెంట్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ బహుకరించగా కాంగ్రెస్ నాయకులు వినాయకునికి గజ మాలను సమర్పించారు. అన్నదాన కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పల్లె దవాఖాన రహదారి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి

**♦ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ఏటూరు నాగారం, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా ఏటూరు నాగారం రోహిర్ (రోయ్యురు) లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖాన) కు రహదారి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఆలెం అప్పయ్య తో కలిసి ఏటూరు నగరం మండలం లోని రోహిర్ (రోయ్యురు) లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖాన) ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పల్లె దవాఖానకు రహదారి సౌకర్యము లేక గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, దానిని గమనించి కలెక్టర్ వారం రోజులలో రహదారి నిర్మాణం పూర్తి చేయాలని, ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయాలని మరియు నిరంతర విద్యుత్ సౌకర్యము ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుమలత, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేయాలి

**– తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**



ఆత్మకూరు, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం నుండి రామన్ పాడ్ వరకు రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ రాజు కార్యదర్శి ఎం ఆంజనేయులు ఉపాధ్యక్షులు అజయ్ దేవన్న అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆత్మకూరు మదనాపురం మండలాల మధ్య ఉన్న ఊక చెట్టు వాగు పై తీవ్రంగా వరదరావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది ఆత్మకూరు నుండి కొత్తకోట వనపర్తి కి వెళ్లాల్సిన ప్రయాణికులు రామన్ పాడ్ డ్యాం మీదిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ దారి కూడా తీవ్రమైన గుంతలు ఒంపులు ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని ఆత్మకూరు నుండి కొత్తకోట కి వెళ్లడానికి రెండు గంటల సమయం పడుతున్న పరిస్థితి ఉంది కావున ఈ రహదారిని తాత్కాలిక మరమ్మత్తులు చేసి రాకపోకలకు అనుగుణంగా మార్చాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంగం జిల్లా కమిటీగా తరపున ప్రభుత్వ అధికారులను వారు డిమాండ్ చేశారు.

# డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన

**– విద్యార్థులు డ్రగ్స్ మత్తు దూరంగా ఉండాలి**

**– విద్యార్థులు సమాజంలో ప్రగతికి సోపానాలు**



నేరేడుచర్ల, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు SI రవీందర్ పట్టణంలోని శ్రీవాణిలో షీ టీమ్స్, సైబర్ నేరాలపైన, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, పోలీసు కళాభృందంతో విద్యార్థిని, విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఎస్ఐ రవీందర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ అధ్వర్యంలో షి టీమ్స్ సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో, స్కూల్లో, కళాశాలలో చదువుకునే విద్యార్థులు, యువతి యువకులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలు, ఓటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు. సైబర్ మోసాలపై1930 టోల్



ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే కాలేజిలో హాస్టళు మహిళలపై వేధింపులు జరిగితే షీ టీం వాట్సాప్ నెంబర్ 8712686056 కుసమాచారం ఇవ్వాలని తెలిపినారు. టీ సేఫ్" యాప్ పై మహిళలు అవగాహన కలిగియుండాలని అన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డిపి లు గా పెట్టుకోవద్దని చెప్పారు. మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు. గంజాయి మత్తుమందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. యువత లోన్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైనపాస్వర్డు పెట్టుకోవాలని అన్నారు. అనంతరం పోలీసు కళబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం నందు శ్రీవాణి హై స్కూల్ ప్రిన్సిపల్ సీతారాంరెడ్డి, పోలీస్ సిబ్బంది ఏ ఎస్ ఐ సైదులు కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపయ్య, క్రిష్ణ, నాగార్జున, చారి, మరియు విద్యార్థినీ విద్యార్థులు సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు


**బారాస పార్టీ మండల అధ్యక్షులు లాకావత్ నరసింహ నాయక్**



గోవిందరావుపేట, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): మలిదశ ఉద్యమకారుడు గోవింద నాయక్ పై చేసిన ఆరోపణలు ఉపసంహరించుకోవాలి. లాకావత్ నరసింహ నాయక్ మాట్లాడుతూ ఒక ఉద్యమకారుల్ని రాజకీయ లబ్ధి కోసమే మాట్లాడుతున్నారని అంటున్నారు 2004 లో తన ప్రభుత్వ ఉద్యోగానికి తృణపాయంగా వదిలిపెట్టి తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొని ములుగు జిల్లా ప్రజలను చైతన్యపరిచి నిస్వార్థంగా పార్టీ కోసం పనిచేశాడే ఏమి ఆశించి పార్టీ కోసం ఉద్యమం కోసం తన బంగారు భవిష్యత్తును వదిలేసి ఇంటి స్థలాన్ని అమ్ముకున్న గొప్ప నాయకుడు గోవింద్ నాయక్, సీతక్కపై ఆరోపణలు చేస్తున్నారన్నది మమ్ముట్టికి అసత్యం, గోవింద నాయక్ ప్రతిరోజు ప్రజల్లో తిరిగే ఉద్యమకారుడు కాబట్టి ప్రజలు చెప్పే సమస్యలను ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా మరియు ఉద్యమకారుడిగా ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు అంతే తప్ప ఎవరు ఎవరి మెప్పు కోసమో రాజకీయ లబ్ధి కోసమో మాట్లాడుతున్నారో ములుగు నియోజకవర్గ ప్రజలకే తెలుసన్నారు. వెంకటాపూర్ మండలంలోని బూరుగుపేట మారేడు కొండ చెరువు తెగిపోయి సంవత్సరం కాలం దాటిపోయిన పరిస్థితి ఇప్పటివరకు దానిని పట్టించుకున్న నాధుడే లేడు. మండలం ను పట్టించుకున్న పాపాన పోలేదు కానీ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు ఇది ఎంతవరకు సమంజసం. కాంగ్రెస్ పార్టీని భగవాన్ రెడ్డిని బండి శ్రీనివాసుని ను సూటిగా ప్రతిస్తున్న సమాధానం చెప్పండి. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎలక్షన్లో ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేశారా. వృద్ధులకు వితంతువులకు నాలుగువేల వేల పెన్షన్ ఇస్తామన్నారు. వికలాంగులకు 6000 నెలకు ఇస్తామన్నారు. ఇంతవరకు ఆ ఊసే లేదు. 2024 వానాకాలం రైతులకు రైతు భరోసా ఇచ్చారా. రెండు లక్షల రుణమాఫీ 100% జరిగింది అంటున్నారు ఎక్కడ జరిగిందా క్షేత్రస్థాయిలోకి వెళ్లి వెంకటాపూర్ మండలంలోని ఏ ఒక్క గ్రామంలో అడుగుదామా చెప్పండి. మండలంలో 40 కోట్ల రూపాయలతో సీసీ రోడ్డు ప్రతి గ్రామంలో పూర్తి చేయడం జరిగింది. మీరు ఇటువంటి విమర్శలు మాని మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకపోండి.. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు 2500 ఇస్తామన్నారు అది ఎటు బాయా. ఇందిరమ్మ ఇల్లు అన్నారు అవి ఎటుబాయే.. ఇప్పటికైనా ఒక నికాసైన ఉద్యమకారుడు ప్రతిరోజు ప్రజల మధ్య ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించే గొప్ప కృషివలుడు అయినటువంటి పోరిక గోవింద్ నాయక్ పైన చేసిన ఆరోపణలు ఉపసంహరించుకోవాలని మీ అటువంటి ఉడకదంపుడు మాటలు అసత్య ఆరోపణలకు ఎవరు భయపడే లేదని గోవిందరావుపేట మండల బారాస పార్టీ అధ్యక్షులు నరసింహ నాయక్ సూచించారు.

# ప్రజావాణి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలి

**■ జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్**



ములుగు జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావులతొ కలసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్ కు సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. వారం వారం వస్తున్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యాలయాలకు సంబంధించిన 21 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం అంశంపై శాఖలు, మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండలంలో పెండింగ్లో ఉన్న సమస్యలు, వాటికి గల కారణాలు, పరిష్కరించేందుకు సిద్ధం చేసుకున్న ప్రణాళిక వివరాలను కలెక్టర్ తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్య పాల్ రెడ్డి, డి ఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య, డిసిఓ సర్దార్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈ డి తుల రవి, డి డబ్లుఓ స్వర్ణ లత లెనినా సి పి ఓ ప్రకాష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో పిచ్చి కుక్క స్వైర విహారం
# 9 మందికి తీవ్ర గాయాలు



ములుగు : ములుగు జిల్లాలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. దొరికిన వారిని దొరినట్లు కరిచి బీభత్సం సృష్టించింది. పిచ్చి కుక్క దాడిలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వివరా ల్లోకి వెళ్తే..ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రం పొదుమూరు గ్రామంలో పిచ్చి కుక్క 9 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచింది. గ్రామానికి చెందిన ఎర్రావుల సమ్మయ్య, కొప్పుల లాలయ్య, దాదాని, సైదా మైతున్ బీ, ఘోరే తో పాటు మరోముగ్గురిపై దాడి చేసి కరవగా తీవ్రంగా గాయపడ్డారు.బాధితులను మంగపేట ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. కాగా, గ్రామాల్లో ఇటీవల పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా స్థానిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

# పాఠశాలల బలోపేతం వివరాల సేకరణ లపై సమీక్షా సమావేశం





మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అధ్యక్షతన యూడైస్ ప్లస్ పథకం ద్వారా పాఠశాలల బలోపేతం వివరాల సేకరణ లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోనీ (1219) ప్రభుత్వ ప్రైవేటు ఎయిడెడ్, మహాత్మ జ్యోతిరావు ఫూలే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, గిరిజన పాఠశాలలలో చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థుల యొక్క పూర్తి వివరాలు నమోదు చేయాలని, దాని ద్వారా పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ ప్రతి విద్యార్థికి వస్తుందన్నారు. ప్రతి పాఠశాలలోని మౌలిక వసతుల కల్పన టాయిలెట్స్, త్రాగునీరు, విద్యుత్, బ్లాక్ బోర్డ్స్, ఫ్యాన్స్, టేబుల్స్, క్లాస్ రూమ్స్, తదితర అన్ని వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల వివరాలు, ప్రభుత్వ, కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రతి ఒక్కరికి వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు. ఈ యూడైస్ ప్లస్ పథకం ద్వారా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక వసతుల, వివరాలు ఆన్లైన్లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, సిబ్బంది ఈ యొక్క డాటా ను వెంటనే నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వి. రాజేశ్వర్, అన్ని విభాగాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

**– సత్వర చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): సమస్య పరిష్కారానికి ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 25 దరఖాస్తులు ప్రజావాణిలో వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరానికి చర్యలు తీసుకునేందుకు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి నుండి జిల్లాకి సంబంధించి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులు అలాగే జిల్లాస్థాయిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు పరిష్కారానికి ప్రతి శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులు నియమించాలని, దరఖాస్తు పరిష్కార వివరాలు వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, మండల పరిధిలోని సమస్య అయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలక్టర్ విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు ఇచ్చిన తీర్పును స్పీకర్ విచారణ చేసి నిర్ణయం వెల్లడించాలి



**♦ బోయినపల్లి వినోద్ కుమార్**

హన్మకొండ, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ బి ఫామ్ పై గెలిచి, పార్టీ మారిన నలుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు పై స్పీకర్ విచారణ చేసి త్వరగా నిర్ణయం తీసుకోవాలని మాజీ పార్లమెంట్ సభ్యులు బోయిన్పల్లి వినోద్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన శాసనసభ్యులు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావుల పై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్ద ఉన్న పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగిందని సుదీర్ఘమైన చర్చల అనంతరం తెలంగాణ అత్యున్నత న్యాయస్థానం నాలుగు వారాల లోపు ఈ పిటిషన్ పై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ ను ఆదేశించిందని అన్నారు. బిఆర్ ఎస్ ఇచ్చిన పిటిషన్ పై స్పీకర్ గడ్డం వెంటనే స్పందించి 4 వారాల్లోపు చర్యలు తీసుకోవాలని లేనిచో హైకోర్టు మళ్లీ జోక్యం చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. 2004- 09 తాను హనుమకొండ పార్లమెంటు సభ్యుడుగా ఉన్న సమయంలో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేసిన అప్పటి ఎంపీ ఆలే నరేంద్ర గారిపై స్పీకర్ సోమనాథ్ చటర్జీ పిటిషన్ వేశామని గుర్తు చేశారు. పార్టీ మారిన సభ్యుల విషయంలో పార్టీల స్పీకర్లు నాన్చుడు ధోరణి తీరుతో తీర్పు ఆలస్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శాసన సభ్యులు గాని పార్లమెంట్ సభ్యులు గాని పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసిన పార్టీ మారిన అనహర్హత వేటువేయాలని 1985లో రాజీవ్ గాంధీ గారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి స్పీకర్లు ఉంటారని అనుకోలేదని అన్నారు

# ఘనంగా ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం

**వ్యవస్థ ఉన్నతికి మానవ వనరులే కీలకం:ప్రో.పి.శ్రీనివాస్ రావు**




హన్మకొండ కేయు, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): సోమవారం రోజున కాకతీయ విశ్వ విద్యాలయంలోని ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల విభాగంలో విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావుకు ఆధ్వర్యంలో మానవ వనరుల ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవస్థ నిర్మాణానికి, పటిష్టతకు మరియు వ్యవస్థ ఉన్నతికి మానవ వనరులే క్రియాశీలక పాత్ర పోషిస్తారని ప్రస్తుతం మానవ వనరుల విద్యార్థులకు మంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయని వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రొఫెసర్ మరియు చైర్మన్ బోర్డు అఫ్ స్టడీస్ ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకోవడం ద్వారా మానవ వనరుల రంగంలో ఉన్నత స్థానాలకి ఎదగడానికి దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలనా విభాగం అధ్యాపకులు, డాక్టర్ చీకటి శ్రీను,డాక్టర్ బుర్రి ఉమా శంకర్, డాక్టర్ మోహన్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ తేజవత్ బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల భాష కాళోజీ కవిత



కంఠేశ్వర్ : ప్రజల భాషలో సాహిత్య సృష్టి ప్రజా చైతన్యానికి దోహదపడుతుందని ప్రజా కవి కాళోజి నా గొడవ పుస్తకం చదివితే అర్థమవుతుందని హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం కేర్ డిగ్రీ కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ భాషా దినోత్సవం కాళోజీ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈరోజు కాళోజి జయంతిని పురస్కరించుకొని ఆయన రాసిన నా గొడవ లోని కవితల్ని హరిదాసభ్యులు పఠించి కాళోజికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రతి ఇంటిలో కనబడి పెద్దమనిషి లాగా కాళోజి కవిలోకానికి దిశా నిర్దేశం చేస్తాడని అన్నారు., మల్లవరపు చిన్నయ్య, పోతులూరి లక్ష్మణ్, ప్రసిద్ధ గాయకుడు సిరిపలింగం, నక్షత్రం సత్యనారాయణ స్వామి, కొయ్యడ శంకర్, కొమిరిశెట్టి నాగరాజు సందేశ్ తదితరులు పాల్గొని కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# ప్రజలను దోసుకుంటున్న ప్రవేటు హాస్పటల్స్ పై చర్యలు తీసుకోవాలి

**■ ఆర్ఎంపీ, పిఏంపిల వ్యవస్థను రద్దు చేయాలని కలెక్టర్ కు వినతి**



హన్మకొండ, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): వైద్యం పేరుతో ప్రజలను దోచుకుంటున్న ప్రైవేట్ హాస్పిటల్ పై చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు హాస్పిటల్కు వత్తాసు పలికే విధంగా పేషంట్లను పంపుతూ కమిషన్లు తీసుకుంటున్న ఆర్.ఎం.పి, పి ఏం పిల వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి డి. తిరుపతి, సహాయ కార్యదర్శి ఓ. చిరంజీవి, కమిటీ సభ్యులు మాటూరు సతీష్ , హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు హాస్పటల్లో ఇష్టానుసారంగా ఓపి ఫీజులను పెంచుకుంటూ, సాయంత్రం అదనంగా రెట్టింపు స్థాయి ఓ పి వసూలు చేస్తూ, అవసరం లేకున్నా టెస్టులు, స్కానింగ్ లు రాస్తూ, హాస్పటల్ ఆవరణంలోనే సొంతగా మెడికల్ షాపులు నిర్వహిస్తూ, ఆపరేషన్, అడ్మిషన్ల, అడ్వాన్సుల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. మెడికల్ ఎస్టాబ్లేషన్ యాక్ట్ నిబంధనలను పాటించడం లేదు. నివాస భవనాలల్లో కనీస నిబంధనలు లేని బిల్డింగ్ ల లో హాస్పిటల్స్ నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పనిచేసే ఆర్ఎంపీ, పి.ఎం.పి వైద్యులు ప్రభుత్వాన్ని బంధనలు విస్మరిస్తూ ప్రైవేటు హాస్పటల్లో చేసే దోపిడికి వత్తాసు పలికే విధంగా గ్రామాల్లో నుంచి వచ్చే రోగులను ప్రైవేటు హాస్పటల్లకు రెఫర్ చేస్తూ టెస్టులు, స్కానింగ్ లో కమిషన్లు తీసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంజక్షన్లు, గ్లూకోస్ బాటిల్స్ పెడుతూ, యాంటీబయటిక్ మందులు ఇస్తున్నారు. వైద్యం పేరుతో దోచుకుంటున్నారు. ప్రైవేటు హాస్పిటల్లో దోపిడిని అరికట్టి, ఆర్ఎంపీ, పిఏంపి ల వ్యవస్థను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే

**– గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 16 ఫిర్యాదులు స్వీకరణ.**

**– జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.,గారు**



సిరిసిల్ల: ప్రజల నుండి పిర్యాదులు స్వీకరించి ప్రతి పిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం ఉదయం10 గంటల నుండి 3 గంటల వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని,అందులో భాగంగా సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 16 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు.గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

జమ్మికుంట: గత పది రోజుల నుండి ఎడతెరిపిలేకుండా పడుతున్న వర్షాలకు మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో రైతులు వేసినటువంటి నీరు నిల్వ ఉండడం వలన పత్తి ఎర్ర బడుతోంది. కొన్ని ప్రాంతాలలో వరి నీటిలో మునిగి పోయింది. ఈ పరిస్థితుల్లో నీటి నుండి మొక్కలను కాపాడుట కొరకు రైతులు కొన్ని పద్ధతులను అవలంబించి, మొక్కలను కాపాడుకొని, పంట దిగుబడిని వచ్చే విధంగా చూడాలని పట్టణంలోని కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే వెంకటేశ్వర్ రావు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల గత వారం రోజులుగా రాష్ట్రంలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి వాతావరణ కేంద్రం నుండి వచ్చిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో జిల్లాలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

ఈ సమయంలో వివిధ పంటలలో చేయువలసిన పనులను గమనించాలని పట్టణంలోని కె వి కె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే వెంకటేశ్వరరావు రైతులకు సలహాలు ఇచ్చారు.

వరి పంట: ప్రస్తుతము పిలక దశలో ఉంది. వరి పొలాలు అధిక వర్షాలకు నీటి ముంపుకు గురవడం, జింకు ధాతు లోపం ఏర్పడటం, బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు సోకే అవకాశం ఉండడం రైతులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు ఉన్నాయి. వీటికి రైతులు పాటించాల్సిన మెలకువలు పొలంలో నుండి సరైన విధంగా మురుగునీరు బయటకు పోయేలా మురుగు నీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలని, వర్షాలు తగ్గేవరకు ఎరువులు పురుగుల మందుల వాడకాన్ని వాయిదా వేయాలని అలాగే వరిలో జింక్ దాతులోపం గమనించినట్లయితే నివారణకు వర్షాలు తగ్గిన తర్వాత రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని, బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు గమనించినట్లయితే నివారణకు వర్షాలు తగ్గిన తర్వాత 0.2 గ్రాముల ప్లాంటో మైసిన్ లీటర్ నీటిని కలిపి వారం రోజులు రెండుసార్లు పిచికారి చేయాలని సీనియర్ శాస్త్రవేత్త రైతులకు సూచించారు. అలాగే పత్తి పంట మొగ్గ వేయు దశలో ఉందని ఆయన తెలిపారు. పంట నీటి ముంపుకు గురవడం అధిక వర్షాల కారణంగా భూమిలో అధిక తేమ ఉండటం వలన పత్తి పంటలు వేరు కుళ్ళు తెగుల సోకే అవకాశం ఉందని ఆయన తెలిపారు. పంట పొలాలలో మురుగు నీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలని అధిక వర్షాల కారణంగా పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే వెంటనే మురుగు నీటిని తీసివేయాలని ఆయన చెప్పారు. వర్షాలు తగ్గేవరకు ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని వాయిదా వేయాలన్నారు. వేరు కుళ్ళు తెగులు సోకడం గమనించినట్లయితే నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండ జిమ్ లీడర్ నీటికి కలిపి వ్యర్థాలు తగ్గిన తర్వాత మొక్క మొదలు తడిచేలా పోయాలని అన్నారు.

# జిల్లాస్థాయిలో టూ కే రెడ్ రన్ నిర్వహణ

**– విజేతలకు బహుమతుల ప్రధానం**



కంఠేశ్వర్ : యూత్ ఫెస్ట్ 2024 లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా నిజామాబాదు లోని జిల్లా స్థాయి లో ఏర్పాటుచేసిన 2కే రెడ్ రన్ కళాశాల బాలుర విభాగంలో గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజీ తరపున మొదటి స్థానం , రెండవ స్థానం మూడవ స్థానం బహుమతులు గా జ్ఞానేశ్వర్,అజయ్, వినోద్ లు కైవసం చేసుకున్నారు. అలాగే బాలికల విభాగంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళ డిగ్రీ కాలేజ్ లో చదువుతున్న విద్యార్థి రోజా, అఖిల, వైష్ణవి లు గెలుపొందారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథి గా హాజరైన అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్యాదికారి డాక్టర్ దేవి నాగేశ్వరి మెడల్స్తో విద్యార్థిని, విద్యార్థులను సత్కరించారు.అందుకు గాను గెలుపొందిన వారికి 1000, 750, 500 నగదు తో పాటు మేమొంటో, సర్టిఫికేట్లు ప్రపంచ ఎయిడ్స్డే రోజున అందజేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ. విద్యార్థులు అందరూ ఎయిడ్స్ పట్ల అవగాహనా పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి గిరిరాజ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ రఫీక్, జిల్లా టిబి కో ఆర్డినేటర్ రవిగౌడ్, ఫిజికల్ డైరెక్టర్ బాలమణి, పాల్గొన్నారు.

# ఐక్యమతంతో ఆదివాసీలు

అదిలాబాద్: ఆదివాసీలు పోరాటానికి వెనుకాడరు. అనుకుంటే సాధించే వరకు పోరాటం ఆపరు. ఐకమత్యానికి కేరాఫ్ అడ్రస్ ఆదివాసీలు. అందుకు నిదర్శనం ఇంద్రవెల్లి ఘటన. ఇప్పటీ ప్రభుత్వంతో అనేక విషయాల్లో ఆదివాసీలు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఐకమత్యం అంటే తరుచు ఆదివాసులే గుర్తుకు వస్తారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో.. వారు ఏదైనా అనుకుంటే నెరవేర్చుకునే వరకు పోరాటం ఆపరు, వారు వారి గ్రామ పెద్దల మాటలను తప్ప వేరే వారి మాటనే వినరు అని పేరు. ఆదివాసీలను ఒప్పించాలంటే చాలా చాలా కష్టతరం అని చెప్పుకుంటారు. ఒకసారి ఆదివాసీలు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు అంటే ఇక ఆ పని పూర్తయ్యే వరకు వారి పోరాటం ఆగదని అధికారులు, రాజకీయ నాయకులు చర్చలు చేస్తుంటారు. నిత్యం కొమురం భీమ్ పోరాట స్ఫూర్తిని నింపు కుంటూ కొనసాగుతారు ఈ ఆదివాసీలు. జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో ఆదివాసులు తమ హక్కుల కోసం ఇంద్రవెల్లిలో శాంతియుతంగా సమావేశం జరుపుతుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆదివాసులు అమరులు కాగా, మరికొందరు రక్తపు మడుగులో ప్రాణాలను అరచేతిలో పట్టుకొని పుట్టకొకడు, గుట్టకొకడు వెళ్లి ప్రాణాలను రక్షించుకున్నారు. ఆ సంఘటనకు సరిగ్గా ఏప్రిల్ 20 నాటికి 43 ఏండ్లు అయ్యింది. ఏజెన్సీ పరిధిలోని ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న అప్పటి రైతు కూలీ సంఘం, పోర్క దొరలు (ప్రస్తుత పీపుల్స్ వార్) ఆదివాసులు ఎదుర్కొంటున్న భూసమస్యలు, అటవీ అధికారుల వేధింపులు, పంటలకు గిట్టుబాటు ధర లేక దళారుల మోసాలు తదితర సమస్యల పరిష్కారానికి ఇంద్రవెల్లి సమీపంలోని హీరాపూర్ లో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఆ రోజున వారాంతపు సంత కావడంతో జిల్లా నలుమూలల నుంచి ఆదివాసులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఇది గమనించిన పోలీసులు సమావేశానికి అనుమతి లేదంటూ వచ్చే ప్రజలను లోపలికి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా సమావేశానికి వెళ్లే ఓ ఆదివాసీ మహిళకు పోలీసులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరి మధ్య మాట మంతి పెరగడంతో అది కాస్త తీవ్ర స్థాయికి చేరుకుంది. దీంతో కోపోద్రిక్తురాలైన ఆ మహిళ తన చేతిలో ఉన్న కొడవలితో ఆ కానిస్టేబుల్ పొట్టలోకి కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే తన ప్రాణాన్ని వదలిపెట్టాడు.

# ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ లో ఇళ్లపై రంగనాథ్ సూచనలు

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేయాలని.. వాటికి భవిష్యత్తు ఉంటుందని చాలా మంది అనుకుంటారు. తాము కష్టపడి సంపాదించిన సొమ్మును హైదరాబాద్‌లోని భూములు, ప్లాట్లపై పెడతారు. అలాంటి వారికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక సూచన చేశారు. హైదరాబాద్ నగరంలో ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేయాలనుకునేవారు ఈ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

నివాసం ఉంటున్న గృహాలను కూల్చబోం. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్నారు. కొత్త నిర్మాణాలు మాత్రమే కూలుస్తున్నాం. ఇప్పటికే నిర్మించి నివాసముంటున్న ఇళ్లను కూల్చివేయడం లేదు. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్‌లో స్థలాలు, ఇళ్లు కొనుగోలు చేయొద్దు. కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. తర్వాత ఇబ్బందులు పడొద్దు' అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు.

హైడ్రా ప్రకటనలో కీలకాంశాలు..

1. ఎఫ్టిఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాలు ఆక్రమించినప్పటికీ.. ఇల్లు, నివాసం ఏదీ కూల్చివేయడం లేదు.

2. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లోకి వచ్చే కొత్త నిర్మాణాలు మాత్రమే కూల్చివేస్తాం. మాదాపూర్ సున్నం చెరువు, దుండిగల్‌లోని మల్లంపేట్ చెరువులో ఈ రోజు కూల్చిన నిర్మాణాలు నిర్మాణంలో ఉన్నాయి. ఎఫ్టిఎల్, బఫర్ జోన్‌లలో అనుమతి లేకుండా నిర్మిస్తున్నారు.

3. అమీన్‌పూర్‌లో కూల్చివేసిన నిర్మాణాలు.. ప్రధానంగా కాంపౌండ్ గోడలు, గదులు, షెడ్‌లు ఆక్రమణకు గురయ్యాయి. కాటసాని రాంభూపాల్ రెడ్డికి సంబంధించిన కొన్ని షెడ్లను కూల్చివేశాం. ఏ వ్యక్తి ఆక్రమించిన ఇల్లు, నివాసం కూల్చలేదు.

4. మల్లంపేట చెరువు, దుండిగల్‌లో కూల్చిన 7 విల్లాలు ఇప్పటికీ నిర్మాణంలో ఉన్నాయి. వాటిలో ఎవరూ లేరు. భవన నిర్మాణ అనుమతులు లేకుండా ఎఫ్‌టిఎల్‌లో ఉన్నాయి. బిల్డర్ విజయలక్ష్మి (స్థానికంగా లేడీ డాన్ అని పిలుస్తారు). ఆమెపై అనేక క్రిమినల్ కేసులు బుక్ అయ్యాయి.

5. సున్నం చెరువులోని నిర్మాణాలను గతంలో కూడా కూల్చివేశారు. కానీ.. వాటిని మళ్లీ తిరిగి నిర్మిస్తున్నారు. అందుకే వాటిని కూల్చివేశాం.

6. బిల్డర్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులపై స్థానిక పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వారిపై చాలా ఫిర్యాదులు వచ్చాయి.

7. ఎవరి ఇళ్లు కూల్చబోమని హైదరాబాద్ ప్రజలందరికీ హామీ ఇస్తున్నాం.

8. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఇల్లు, ఫ్లాట్, భూమిని కొనుగోలు చేయవద్దని ప్రజలను కోరుతున్నాము. అటువంటి ఆస్తుల కొనుగోలుదారులకు సంబంధించి ఏదైనా సందేహం ఉంటే.. వారు హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌ను గానీ.. అధికారులను గానీ సంప్రదించాలి.

# కాంగ్రెస్ లో ప్రోటోకాల్ రగడ

కరీంనగర్: తెలంగాణ కాంగ్రెస్లో కొత్త తలనొప్పి మొదలైంది. తమ విషయంలో ప్రొటోకాల్ పాటించడం లేదని అధికార పార్టీ ఎమ్మెల్యేలే రచ్చ చేస్తుండటం పార్టీ పరువును బజారుకీడ్చుతోంది. సహజంగా ప్రొటోకాల్ విషయంలో విపక్షాలు విమర్శలు సంధిస్తుంటాయి. కానీ,ఇక్కడ మాత్రం అధికార పార్టీ ఎమ్మెల్యేలే విపక్ష పాత్రను పోషించాల్సి వస్తోందంటున్నారు. వరుసగా ఒకరి తర్వాత మరొకరుగా అధికారులు, పోలీసుల వ్యవహారశైలిపై విమర్శలు సంధిస్తుండటంతో ప్రభుత్వంలో ఏం జరుగుతోందనే చర్చ మొదలైంది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రెండురోజుల క్రితమే కొందరు పోలీసులపై స్పీకర్కు ఫిర్యాదు చేయగా, తాజాగా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కూడా అధికారుల తీరుపై నిరసన స్వరం వినిపించడం హాట్టాపిక్గా మారింది. గత పదేళ్లు బీఆర్ఎస్ లో అవమానాలు భరించలేకనే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చామని.. తీరా ఇక్కడా పద్ధతులు మారడం లేదని మరో ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. కావాలనే అధికారులు తమని తక్కువ చేసి చూస్తున్నారని కొందరు ఎమ్మెల్యేలు వాపోతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కావడంతో చాలామంది బయటకు చెప్పుకోలేక లోలోపల మదనపడుతున్నట్లు గాంధీభవన్లో టాక్ వినిపిస్తుంది. తాము అడిగిన సమాచారం ఇవ్వడం లేదని మంత్రులు సైతం తమ సన్నిహితుల వద్ద గొణుగుతున్నల్లు చెబుతున్నారు. ఇక కార్పొరేషన్ చైర్మన్లు అయితే, పవర్ లేని పదవి తీసుకొని తప్పు చేశామని గొల్లు మంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటుతున్నా ప్రభుత్వంపై పట్టు సాధించలేదని అధికార పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మంత్రులంతా దాదాపు కొత్తవారు కావడంతో అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అవుతోందంటున్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ సైతం గుర్తించినా ఎలా హ్యాండిల్ చేస్తే ఏమవుతుందో అని ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటైన ప్పటికీ అధికార యంత్రాంగం అంతా పాతదే కావటం వల్ల కొత్త ప్రభుత్వాన్ని లైట్గా తీసుకుంటున్నారా అన్న చర్చ నడుస్తోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలే ప్రొటోకాల్ పాటించడం లేదని వాపోతున్నా రంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే వేముల వీరేశం తీవ్ర దుమారం రేపగా, తాజాగా మాన కొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ఓ పోలీసు అధికారి వేధింపులకు గురిచేస్తున్నారనే సమాచారం కాంగ్రెస్ నేతలను షాక్కు గురిచేస్తోంది. మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని ఒక పోలీస్ స్టేషన్ సీఐగా తనకు నచ్చిన వారిని ముఖ్యమంత్రి అనుమతితో ఎమ్మెల్యే నియమించు కున్నారట.. ఈ నియామకాన్ని జీర్ణించుకోలేని అక్కడి పోలీస్ కమిషనర్ ఏకంగా ఎమ్మెల్యేనే టార్గెట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కమిషనర్ తనను వేధిస్తున్నట్లు స్వయంగా ఎమ్మెల్యేనే వాపోతుండటంతో అధికారుల తీరు చర్చకు తావిస్తోంది. పోలీస్ కమిషరే కాకుండా మానకొండూరులో ఏ అధికారి కూడా ఎమ్మెల్యేను లెక్క చేయడం లేదనే ప్రచారం జరుగుతోంది. ఇదే విధంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విషయంలోనూ అధికారులు చిన్నచూపు చూస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ఎమ్మెల్సీలు కూడా ఎమ్మెల్యేల మాదిరిగా అవమానాలు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఏ సమాచారం అడిగినా అధికారులు సరిగా స్పందించడం లేదని ఎమ్మెల్సీ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రుల్లో ఎక్కువ మంది కొత్తవారు కావడంతో కొందరు అధికారులు వారిని తప్పుదారి పట్టిస్తున్న ట్లు సచివాలయ ఉద్యోగ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తు న్నాయి. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలకే ఇలాంటి అవమానాలు ఎదురవు తుంటే తమ పరిస్థితి మరింత ఘోరంగా ఉందని కార్పొరేషన్ చైర్మన్లు వాపోతు న్నారు. ఛార్జ్ తీసుకోగానే తమ తమ కార్పొరేషన్ పరిధిలో గతంలో జరిగిన వాటిపై విచారణ జరిపి వాస్తవాలను బయట పెట్టాలని భావించి నా.. తమకి అధికారుల నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదని నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇలా మొత్తం కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు అంతా తమను పట్టించుకోవడం లేదని వరుసగా గొంతు విప్పుతుండటంతో ప్రభుత్వ పెద్దలకు ఏం చేయాలో తోచడం లేదటజ కొందరు ఎమ్మెల్యేలు నేరుగా ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్రెడ్డికి అధికారుల తీరును పూసగుచ్చినట్లు వివరించారని సమాచారం. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# కేసీఆర్ నవగ్రహ యోగం...

మెదక్: రాజకీయ యోగానికి యాగం దగ్గరి దారని చాలా మంది నమ్ముతుంటారు. ఇలాంటి సెంటిమెంట్లను నమ్మేవారిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందుంటారు. అందుకే ఎప్పటికప్పుడు యజ్ఞాలు, యాగాలతో తన భక్తి ప్రవత్తులను చాటుకుంటారు కేసీఆర్. అధికారంలో ఉండగా, రకరకాల యాగాలు చేసిన కేసీఆర్ ఇప్పుడు ప్రతిపక్షంలోనూ నవగ్రహాల అనుగ్రహం కోసం మరో యాగం చేస్తున్నారట ఇందుకోసం తన లక్కీనెంబర్ ఆరో తేదీనే యాగం ప్రారంభించడం మరో విశేషంగా చెబుతున్నారు తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆధ్యాత్మికత కూడా చాలా ఎక్కువ. తరచూ గుడులు, గోపురాలను దర్శించుకునే కేసీఆర్ ఎప్పటికప్పుడు యజ్ఞయాగాదులు చేస్తుంటారు. అధికారంలో ఉండగా, చాలా యాగాలను చేసిన కేసీఆర్ వాటి ఫలితా లను పొందారు. కానీ, ఎందుకనో గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈ తరహా పూజలకు కాస్త దూరంగా ఉన్న కేసీఆర్ ఇప్పుడు మళ్లీ యాగం చేయడం మొదలుపెట్టారట. తన లక్కీ నెంబర్ 6 అయితే.. సెప్టెంబర్ 6న నవగ్రహ యాగాన్ని మొదలుపెట్టారు కేసీఆర్. తన వ్యవసాయ క్షేత్రంలో కేవలం కుటుంబ సభ్యుల మధ్య ఈ యాగం చేస్తున్నారు కేసీఆర్. దీంతో కేసీఆర్ సెంటిమెంట్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పూర్తిగా డైలమాలో పడిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ చరిత్రలోనే లేనట్లు ఒక్కస్థానం గెలుచుకోలేకపోయింది. ఇక వ్యక్తిగతంగా కుమార్తె కవిత అరెస్టు కేసీఆర్ ను మరింత కుంగదీసింది. ఇప్పుడు కవిత బెయిల్‌పై విడుదల కావడం.. ఇకపై ఇలాంటి కష్టాలు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో నవగ్రహ యాగం చేయాలని సంకల్పించారట కేసీఆర్. ఈ యాగం తర్వాతే స్థానిక ఎన్నికల్లో క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాలని నిర్ణయించారట కేసీఆర్. త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్నందున మంచి రోజు చూసుకుని నవగ్రహ యాగం మొదలుపెట్టారు కేసీఆర్. ఉద్యమనేతగా తెలంగాణపై ప్రత్యేక ముద్ర వేసిన కేసీఆర్‌లో దైవభక్తి ఎక్కువ ఉద్యమ సమయం నుంచే ఆయన ఎన్నో యాగాలు చేసేవారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మహాయాగాలను చేసిన కేసీఆర్ వాటి ఫలితాలను అందుకున్నట్లు పలు సందర్భాల్లో చెప్పారు. 2015లో ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో 5 రోజుల పాటు ఆయుత చండీ యాగం నిర్వహించిన కేసీఆర్? 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజశ్యామల యాగం చేసి రెండోసారి రాజయోగాన్ని ఒడిసిపట్టుకున్నారు. ఐతే 2023 ఎన్నికలకు ముందు రాజ శ్యామల యాగం మళ్లీ చేసినా,ఆయనకు రాజ యోగం దూరమైంది. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీనిబలోపేతం చేయాలనే ఉద్దేశంతో మళ్లీ యాగం చేస్తున్న ట్లు ప్రచారం జరుగుతోంది. ఈ యాగం పూర్తయిన తర్వాత తెలంగాణ భవన్లో పార్టీ నేతలతో నేతలతో కీలక సమావేశం ఏర్పాటు చేయనున్నారు కేసీఆర్. మరోవైపు కేసీఆర్ చేస్తున్న నవగ్రహ యాగంలో ఎమ్మెల్సీ కవిత కూడా పాలుపంచుకోగా, కుమారుడు కేటీఆర్ విదేశీ పర్యటన ముగించుకుని 7వ తేదీన యాగంలో భాగస్వామి అవుతారని చెబుతు న్నారు. మొత్తానికి నవగ్రహాల అనుగ్రహించాలని కోరుతూ కేసీఆర్ చేస్తున్న యాగం ఎంతవరకు ఫలితమిస్తుందో కానీ, సెంటిమెంట్ వర్క్ అవుట్ కావాలని బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం బలంగా కోరుకుంటు న్నాయి.

# 1097 మందిపై ఎన్నికలపై అనర్హత

నల్గోండ: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు చేస్తోంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు స్థానిక నేతలు ఎప్పటి నుండో సన్నాహాలు చేసుకుంటున్నారు. అయితే కొందరికి ఓ చిక్కు సమస్య పోటీకి అనర్హులుగా చేసింది. 2019లో నల్లగొండ జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి. జనవరిలో పంచాయతీలకు, ఏప్రిల్, మే నెలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ఎన్నికలు జరిగాయి. పంచాయతీరాజ్ 2018 చట్టం నిబంధనల మేరకు 45 రోజుల్లో ఎన్నికల సంఘానికి ఓడిన, గెలిచిన అభ్యర్థులు ఆయా ఎంపీడీవోలకు లెక్కలు సమర్పించాల్సి ఉంటుంది. ఓడిపోయామని కొందరు, అవగాహన లేక మరికొందరు లెక్కలు చూపలేదు. దీంతో నల్లగొండ జిల్లాలో 1097 మందిపై ఎన్నికల్లో పోటీచేయకుండా ఎన్నికల సంఘం 2021లో నిషేధం విధించింది. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తు ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ఖర్చు వివరాలు అందజేయక నిషేధం బారిన పడిన అప్పటి అభ్యర్థులు ఇప్పుడు పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. గ్రామ పంచాయతీల పాలక మండళ్ల పదవీ కాలం ఫిబ్రవరి 4కు ముగిసింది. మండల, జిల్లా పరిషత్ లకు జూన్ పదవీకాలం ముగిసిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం గడువులోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఆలస్యమవుతోంది. అయితే తాజాగా ప్రభుత్వం తాజాగా స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణ కోసం కసరత్తు చేస్తోంది. ఎన్నికల వివరాలు సమర్పించని నేతలపై ఎన్నికల సంఘం విధించిన మూడేళ్ల సమయం 2024 జులైతో ముగిసింది. నల్లగొండ జిల్లాలో సర్పంచులు16, వార్డు సభ్యులు1021, ఎంపీటీసీ సభ్యులు 54, జడ్పీటీసీ సభ్యులు ఆరుగురు అనర్హత వేటు పడి ఉన్నారు. ప్రభుత్వం.. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికలు గడువులోగా నిర్వహించి ఉంటే వారికి పోటీ చేసే అవకాశం లేకపోయేది. పోటీకీ అవకాశం రావటం, రిజర్వేషన్లు కూడా మారబోతున్నాయన్న సంకేతాలతో అభ్యర్థులు బలం, బలగాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. మొత్తం మీద వీరికి ఆలస్య అమృతమైంది.

# ముంపు బాధితులను ఆసుకునేందుకు ఎంతైనా ఖర్చు చేస్తాం

**- ప్రజలంతా మన బిడ్డలే**

**- వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు**

ఖమ్మం: ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజాప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోంది. తాజాగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజప్రభుత్వం ప్రజల కోసం 24బై7 అందుబాటులో ఉంది. ప్రజల సమస్యలు తీర్చేందుకు నిరంతరం తపిస్తోంది. ఖమ్మం జిల్లాలో ఆదివారం కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మరోసారి మున్నేరువాగు నగరాన్ని ముంచెత్తే ప్రమాదకర పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హుటాహుటిన ఖమ్మం నగరానికి బయలుదేరారు. ప్రమాదకర పరిస్థితులు తలెత్తవచ్చన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్ నుంచి ఖమ్మం బయలు దేరారు.

దారి మొత్తం కుంభవృష్టి కురుస్తున్న పరిస్థితుల మధ్య ప్రజా సంక్షేమం తప్ప మరేమీ పట్టించుకోకుండా భట్టి విక్రమార్క రాత్రి 11.30 గంటల సమయంలో ఖమ్మం చేరుకున్నారు. వెంటనే వరద ముంపు ప్రభావిత ప్రాంతమైన కాలువొడ్డు చేరుకుని అక్కడ ప్రజలతో మాట్లాడారు. వరద ముంపు అధికంగా ఉండడంతో ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు లేదంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. అనంతరం కాలవొడ్డు వద్ద మున్నేరు బ్రిడ్జి దగ్గర వరదను పరిశీలించారు. అక్కడనుంచి ఖమ్మం పట్టణంలో మరోసారి మున్నేరు వాగు వరద ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో స్వర్ణ భారతి పునరావాస శిబిరంలో వరద ముంపు బాధితులని పరామర్శించారు. పునరావాసకేంద్రంలో ఉంటున్న బొక్కల గడ్డకు చెందిన వందకు పైగా కుటుంబాలతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయసహకారాలపై వరదబాధితులతో మాట్లాడారు. భోజన ఏర్పాట్లు వైద్య పరమైన అంశాలను పర్యవేక్షించారు. బాధితులకు దుప్పట్లు తదితర సౌకర్యాలు కల్పించాలి అని అధికారులను ఆదేశంచారు.

అక్కడనుంచి వరద ముంపు బాధితుల కోసం ఖమ్మం నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పునరాదశ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు బాధితులకి సమయానికి ఆహారం, అనారోగ్యం ఏర్పడితే అందిస్తున్న వైద్య సేవలు గురించి బాధితులతో మాట్లడారు. అక్కడే ఉంటున్న బొక్కల గడ్డ ప్రాంతానికి చెందిన మరో యాభై కుటుంబాల ను పరామర్శించి ఏర్పాట్ల గురించి అడిగారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని అర్ధరాత్రి రాత్రి పొద్దు పోయాక పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు బాధితుల వద్దకు వెళ్లి వారితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో వారికి అందుతున్న ఆహారం, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్న అనారోగ్యం వచ్చిన అధికారులు తక్షణం స్పందించి తమకు మందులు అందిస్తున్నారని బాధితులు ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రానికి స్వయంగా తరలిస్తున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. పై జిల్లాల లో ఇంకా వర్షాలు తగ్గలేదు.. మున్నేరు కాలవకు క్రమక్రమంగా వరద పెరుగుతుంది.. ఈ నేపథ్యంలో కాబట్టి ముందస్తుగా మున్నేరువాగు చుట్టుపక్కల ప్రజలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారీగా కురుస్తున్న వర్షాలకు ముంపు బాధితులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది ప్రజల కోసం పనిచేసే ప్రజా ప్రభుత్వం.. ప్రజల ప్రభుత్వం, ఈ ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం మాత్రమే పనిచేస్తుందని అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు మన బిడ్డలేనన వారిని ఆదుకోవడం ప్రభుత్వ కర్తవ్యం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు. వరద ముంపు బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు అయినా పెట్టేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, స్థానిక వైద్య, రెవెన్యూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భారీ వినాయకుడు... నవరాత్రులు.. ట్రాఫిక్

హైదరాబాద్: వినాయక చవితి వచ్చిందంటే రాజధాని నగరంలో ఏ గల్లీ చూసినా వినాయక మంటపం కనిపిస్తుంది. నవరాత్రులు భక్తులు ఫుల్ హుషారుగా ఈ వేడుక చేసుకుంటారు. ముఖ్యంగా హైదరాబాద్ గణేషుడు అంటే వెంటనే ఖైరతాబాద్ విఘ్నేషుడు గుర్తుకు వస్తాడు. ఈ నవరాత్రుల్లో కనీసం 30 నుంచి 40 లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలోనే పోలీసు లు ఇక్కడ భారీ బందోబస్తుతోపాటు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్లు కూడా చేస్తుంటారు. ఈ సారి కూడా ఖైరతాబాద్ గణేషుడి మంటపం చుట్టూ పలు మార్గాలను వాహన దారులకు మూసేశారు. అందుకు కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సూచించారు. ఈ మార్పులు పది రోజులపాటు అంటే వినాయక మహా నిమజ్జనం వరకు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి రైల్వే గేట్ దాటి ఖైరతాబాద్ గణేషుడి విగ్రహం వైపునకు వచ్చే దారిలో వాహనాలకు అనుమతి లేదు. సచివాలయం వెనుక వైపున మింట్ కాంపౌండ్ నుంచి ఖైరతాబాద్ వినాయకుడి విగ్రహం వైపునకు అనుమతి లేదు. ఖైరతాబాద్ పోస్టాఫీస్ నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వద్దకు గల దారిని కూడా వాహనాలకు మూసేస్తారు. రాజ్ దూత్ లేన్ నుంచి ఖైరతాబాద్ విగ్రహం వద్దకు వచ్చే దారిలో కూడా వాహనాలకు అనుమతి లేదు. నెక్లెస్ రోటరీ నుంచి ఐమాక్స్, సైఫాబాద్ పోలీసు స్టేషన్ మీదుగా మింట్ కాంపౌండ్ వైపు వచ్చే దారిలో కూడా వాహనాలను అనుమతించరు. ఈ దారులకు ప్రత్యామ్నా మార్గాలను కూడా ట్రాఫిక్ అధికారులు సూచించారు. మింట్ కాంపౌండ్ వైపు నుంచి ఖైరతాబాద్‌కు వెళ్లే వారు.. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ కింది నుంచి సచివాలయం ముందు నుంచి ఎన్టీఆర్ గార్డెన్.. రోటరీ నెక్లెస్.. ఆ తర్వాత ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ ఎక్కేసి వెళ్లిపోవచ్చు. అలాగే.. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వైపు నుంచి ఇక్బాల్ మినార్.. అక్కడి నుంచి సైఫాబాద్ ఓల్డ్ పీఎస్.. అక్కడి నుంచి నిరంకారి నుంచి నేరుగా ఖైరతాబాద్ జంక్షన్‌కు వెళ్లవచ్చు. ఖైరతాబాద్ మహా గణేషుడి దర్శనం కోసం వచ్చే భక్తులు తమ వాహనాలను పార్క్ చేసుకోవడానికి కూడా కొన్ని పార్కింగ్ ప్లేస్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. నెక్లెస్ రోటరీ సమీపంలో ఐమాక్స్ పక్కనున్న అంబేద్కర్ స్క్వేర్‌లో తమ వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఐమాక్స్‌కు ఎదురుగా, ఎన్టీఆర్ గార్డెన్, సరస్వతి విద్యా మందిర్, రేస్ కోర్స్ రోడ్.. ఈ ఏరియాల్లో పార్కింగ్ చేసుకోవచ్చు. వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఊరూవాడ వినాయక విగ్రహాలను నెలకొల్పి పూజలు చేస్తున్నారు. వరుణుడి కాస్త శాంతించటంతో చాలాచోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ వినాయకుడు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాడు. ఈసారి 70 అడుగుల ఎత్తులో ఖైరతాబాద్ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ ఉత్సవాలను ప్రారంభించి 70 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా 70 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పి పూజలు నిర్వహిస్తున్నారు. 7 అంకెకు ప్రాధాన్యమిస్తూ 7 తలలు, 7 సర్పాలు రెండు వైపులా 7 చొప్పున మొత్తం 14 చేతులతో విఘ్నేశ్వరుడిని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ 28 అడుగుల వెడల్పుతో విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించింది. సప్తముఖ మహాగణపతిగా ఖైరతాబాద్ వినాయకుడు పూజలు అందుకుంటున్నాడు. భారీ వినాయకున్ని చూసేందుకు భక్తులు తరలివస్తున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులు సెలవు రావటంతో ఎక్కువ మంది భక్తులు తరలివచ్చారు. ఇంకోవైపు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ముగ్గురు డీఎస్పీలు, 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 33 మంది ఎస్సైల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కోలీవుడ్‌లో మహిళల రక్షణకు ఓ కమిషన్

తిరువనంతపురం: మలయాళ చిత్రపరిశ్రమలో నటీమణులపై వేధింపులకు సంబంధించి జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక దేశ్యాప్తంగా అలజడి రేగింది. దీంతో తమిళ చిత్ర పరిశ్రమ ముందస్తు చర్యలు చేపట్టింది. కోలీవుడ్‌లో మహిళల రక్షణకు ఓ కమిషన్ ఏర్పాటు చేసింది సౌత్ ఇండియన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నడిగర్ సంఘం. ఈ కమిటీకి నటి రోహిణిని అధ్యక్షురాలిగా నియమించింది. నడిగర్ సంఘం 68వ జనరల్ కౌన్సిల్ సమావేశం చెన్నైలోని కామరాజర్ అరంగంలో జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు. జనరల్ కౌన్సిల్ సమావేశంలో నడిగర్ సంఘం అధ్యక్షుడు విశాల్, కోశాధికారి నాసర్, కార్తీతోపాటు పలువురు పాల్గొన్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి ఫిర్యాదు అందిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, నటుడు విశాల్ తెలిపారు. రోహిణి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. రోహిణీతోపాటు మరో నటి సుహాసిని ఈ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తారని చెప్పారు. నడిగర్ సంఘంలో సభ్యత్వం లేని వారైనా సరే... ఎలాంటి సమస్య ఎదుర్కొన్నా ఫిర్యాదు చేయొచ్చని అన్నారు. సీనియర్ యాక్టర్, కొత్త నటుడు, దర్శకుడు, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్.. ఇలా ఎవరిపై ఫిర్యాదు వచ్చినా... తక్షణమే చర్యలు తీసుకుంటా మన్నారు. ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపుల సమస్యను చాలా సీరియస్‌గా తీసుకున్నామని అన్నారు నడిగర్ సంఘం ప్రెసిడెంట్, నటుడు నాజర్. అందుకే కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కమిటీలో న్యాయవాదులు కూడా ఉంటారన్నారు. ఇది తమ తొలి అడుగు అని చెప్పారు నాజర్. ఇండస్ట్రీలో పనిచేసే మహిళలకు ఒక నమ్మకాన్ని కలిగిస్తున్నామన్నారు. జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తమకు ఎదురైన వేధింపుల గురించి నటీమణులు ధైర్యంగా బయటకు వచ్చి మాట్లాడుతున్నారు. ఈ అంశంపై నటి రోహిణి కీలక వ్యాఖ్యలు చేశారు. లైంగిక వేధింపుల గురించి మీడియా ముందు మాట్లాడొద్దని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయకుండా... మీడియా ముందు మాట్లాడటం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఇక.. 2019 నుంచి నడిగర్ సంఘంలో అంతర్గత కమిటీ పని చేస్తోంది కానీ... అంత చురుకుగా లేదు. దీంతో... రోహిణి అధ్యక్షత కమిటీని నియమించారు. మహిళలు ఫిర్యాదులు చేసేందుకు ముందుకు రావాలని రోహిణి కోరారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నేరస్తులపై ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తారు. బాధితులకు న్యాయ సహాయం అందేలా చూస్తామని నాడిగర్ సంఘం తెలిపింది. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులు, వేధింపులను తెలుపుతూ... జస్టిస్ హే కమిటీ... ఒక నివేదికను తయారు చేసి కేరళప్రభుత్వానికి అందించింది. పనితీరు, రెమ్యునరేషన్, సాంకేతి రంగంలో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై కమిటీ అధ్యయనం చేసింది. క్యాస్టింగ్ కౌచ్ మొదలు.. వివక్ష వరకు మాలీవుడ్‌లో మహిళలు ఎన్నో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని రిపోర్టులో పేర్కొంది. ఈ రిపోర్ట్ దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో... నటీమణులు బయటకు వచ్చి... తమకు ఎదురైన చేదు అనుభవాలు, వేధింపులను వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో... ప్రముఖ మలయాళ దర్శకుడు రంజిత్, నటుడు జయసూర్య, మణియన్ పిళ్లరాజుపై కేసులు కూడా కేసులు నమోదయ్యాయి. మాలీవుడ్ తరహాలోనే... ఇప్పుడు కోలీవుడ్‌లో కూడా మహిళలపై వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకంగా కమిటీని నియమించింది నడిగర్ సంఘం.

# క్లౌడ్ బరస్ట్ వల్ల విపరీతమైన వర్షాలు

న్యూఢిల్లీ: ఈ స్థాయిలో వానలు కురుస్తున్నాయి. ఇలాంటి దుస్థితి నేను ఎప్పుడూ చూడలేదు.. గుజరాత్ రాష్ట్రాన్ని చాలా ఏళ్లుగా పరిపాలించా. ఎన్నో ప్రకృతి విపత్తులను చవి చూశా. కానీ ఇప్పుడు కురుస్తున్న వర్షం, పోటెత్తుతున్న వరద ఎప్పుడో చూడలేదు. గుజరాత్ మాత్రమే కాదు, దేశం మొత్తం జల ప్రళయం కనిపిస్తోందని" స్వయంగా నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల వర్షాలకు తెలుగు రాష్ట్రాల్లోని విజయవాడ, ఖమ్మం, వరంగల్ ప్రాంతాలు నీట మునిగాయి. గంటల వ్యవధిలోనే 30+ సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షం వల్ల వరద తాకిడి పెరిగిపోవడంతో జాతీయ రహదారులు కొట్టుకుపోయాయి. వంతెనలు నామరూపాలు లేకుండా పోయాయి. పంట పొలాలు ఇసుక మేటలు వేసాయి. గ్రామాలకు గ్రామాలు బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ఇప్పటికీ చాలా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. గత ఏడాది క్లౌడ్ బరస్ట్ వల్ల విపరీతమైన వర్షాలు కురిసాయి. కొన్ని ప్రాంతాలలో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురవలేదు. ఈసారి ఎల్ నినో ప్రభావం పూర్తిగా లేదు. అయితే గతానికంటే భిన్నంగా అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి.. అయితే ఈ వర్షాలు అన్నిచోట్ల పడితే పెద్దగా సమస్య ఉండేది కాదు. అయితే వర్షం ఒక్క చోట మాత్రమే కుండ పోతగా కురవడం వల్ల ఇబ్బంది ఎదురవుతోంది. దీనిని వాతావరణ నిపుణులు క్లౌడ్ బరస్ట్ అని పిలుస్తున్నారు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మేడారం ప్రాంతంలో క్లౌడ్ బరస్ట్ అవ్వడం వల్ల కొన్ని వేల ఎకరాల్లో అడవి నాశనమైంది. చెట్లు మొత్తం విరిగిపోయాయి.. కృష్ణాజిల్లాలో విజయవాడ నగరం మొత్తం నీట మునిగిపోయింది.. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే ఖమ్మం, విజయవాడ, వరంగల్ మాత్రమే కాదు.. దేవభూమి ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్ వంటి రాష్ట్రాలలో క్లౌడ్ బరస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి.. కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో జలవిలయం చోటు చేసుకోవడానికి కూడా క్లౌడ్ బరస్ట్ కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మనదేశంలోనే కాదు చైనాలోనూ క్లౌడ్ బరస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ యాగి తుఫాను పెను విధ్వంసం సృష్టిస్తోంది. వరదలు చుట్టుముట్టడంతో చైనా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అక్కడిదాకా ఎందుకు పూర్తి ఎడారి ప్రాంతమైన దుబాయ్ లోనూ విపరీతమైన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతాన్ని వరదలు వణికిస్తున్నాయి.. ఇక బంగ్లాదేశ్ లోనూ తుఫాన్ అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఇలా ప్రపంచం నలుమూలల ఏదో ఒకచోట ప్రకృతి విపత్తు చోటు చేసుకుంటూనే ఉంది. అంటే అమెరికా నుంచి మొదలు పెడితే ఆఫ్ఘనిస్తాన్ వరకు క్లౌడ్ బరస్ట్ విపత్తు అనేది ఉంది.. ప్రకృతిపై మనిషి చేస్తున్న పెత్తనం వల్ల ఇలాంటి ఇలాంటి విపత్తులు చోటుచేసుకుంటున్నాయి. వాతావరణ మార్పుల వల్ల మేఘాలు ఏర్పడటం.. అవి బద్దలైపోయి విస్తారంగా వర్షం కురవడం వంటి పరిణామాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు మేఘాలు అంతటా విస్తరించి వర్షాలు కురిసేవి. కానీ ఇప్పుడు మేఘాల గమనంలో కూడా మార్పు వస్తోంది. ఒకే చోట కుండపోత గా వర్షాలు కురుస్తున్నాయి. భూ ఉపరితలం వేడెక్కడం.. సముద్ర ఉపరితల వేడెక్కడం.. మేఘాలు భారీగా సముద్రపు నీటిని తీసుకొని అంతే స్థాయిలో ఒకే చోట వర్షాలు కురిపించడం వంటి పరిణామాల వల్ల ఇంతటి విపత్తులు చోటు చేసుకుంటున్నాయని వాతావరణ నిపుణులు అంటున్నారు. గత ఏడాది జూలై నెలలో క్లౌడ్ బరస్ట్ అయింది. ఆ సమయంలో దానిని విదేశీ కుట్ర అని నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపించారు.. అందులో ఎంతవరకు నిజం ఉందో తెలియదు గాని.. ప్రస్తుతం మనిషి చేస్తున్న పనుల వల్ల ప్రకృతి ఆగ్రహిస్తోందనేది మాత్రం నూటికి నూరుపాళ్ళు కఠిన వాస్తవం.

# చికిత్స పొందుతూ శిశువు మృతి

## దేవరకొండ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఘటన

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని బాబురామ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ లో గత రెండు రోజులుగా చికిత్స పొందుతున్న శిశువు మృతి చెందడం జరిగింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందాడని శిశువు తండ్రి ఆగ్రహంతో ఆస్పత్రి అద్దాన్ని పగలగొట్టాడు.

మృత శిశువు తండ్రి రమేష్ వివరాల ప్రకారం దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని డిండి మండలం ఎర్రారం గ్రామపంచాయతీ సోములా నాయక్ తండా ఇస్లావత్ రమేష్ జ్యోతి దంపతులకు ఎనిమిది సంవత్సరాల కాన్పులో మగ శిశువు జన్మించడం జరిగింది. జ్యోతికి గత రెండు రోజుల క్రితం దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కాన్పు జరిగింది. అయితే అక్కడే విధులు నిర్వహిస్తున్న బాబురామ్ నాయక్ దేవరకొండలో ఓ ప్రైవేట్ చిల్డ్రన్స్ ఆసుపత్రిని నిర్వహిస్తున్నాడు. అప్పుడే పుట్టిన శిశువుకు ఆరోగ్యం సరిగా లేదని తన ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురావాలని బాబు రాం నాయక్ సూచనతో ప్రైవేట్ హాస్పిటల్ లో అడ్మిట్ చేయడం జరిగింది. శనివారం శిశువుకు బాగా ఆయాసం రావడం గమనించిన తండ్రి డాక్టర్కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడం, సిబ్బంది పట్టించుకోకపోవడంతో నిన్నటి నుంచి బాబు ఆరోగ్య రీత్యా చాలా ఇబ్బందులకు గురయ్యాడు. ఆదివారం ఉదయం ఆసుపత్రికి వచ్చిన డాక్టర్ బాబురామ్ నాయక్ శిశువు దగ్గరికి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నట్లు తెలుసుకొని ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడని, ఆస్పత్రి సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించాలని బాధితుల రమేష్ ఆస్పత్రి ముందున్న ఓ అద్దాన్ని పగలగొట్టాడు. 8 సంవత్సరాల తర్వాత పుట్టిన మగ శిశువు మృతికి కారణమైన డాక్టర్ బాబురావు నాయక్ పై చర్యలు తీసుకోవాలని రమేష్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కొత్తకోట శ్రీనివాసరెడ్డి ట్రాన్స్ ఫర్ ఎందుకు...

హైదరాబాద్: హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి పై రేవంత్ ప్రభుత్వం వేటు వేయడం సంచలనం కలిగించింది. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ నగర సిపిగా పనిచేసిన ఆనంద్ కు రేవంత్ ప్రభుత్వం తిరిగి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ పోస్టు ఇచ్చింది. రేవంత్ తీసుకున్న నిర్ణయం తెలంగాణలో సంచలనంగా మారింది. వినాయక చవితి నాడు దాదాపు ఐదుగురు సీనియర్ ఐపిఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. హైదరాబాద్ నగర్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డికి స్థానచలనం కలిగించింది. వాస్తవానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత శ్రీనివాసరెడ్డిని ప్రత్యేకంగా హైదరాబాద్ నగర కమిషనర్ గా నియమించారు. ఏరి కోరి తెచ్చుకున్న అధికారిపై ఆయన బదిలీ వేటు వేయడం సంచలనంగా మారింది. అప్పట్లో కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సివి ఆనంద్ కేంద్ర సర్వీసులో ఉన్నారు. ఆయనప్పటికీ ఆయనను ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రానికి పిలిపించారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ గా నియమించారు. తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో డిజిపి అంజనీ కుమార్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ ఆనంద్ ను ఎన్నికల సంఘం పక్కన పెట్టింది. ఆ తర్వాత రేవంత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సివి ఆనంద్ ను ఏసీబీ డీజీగా రేవంత్ నియమించారు. అయితే ఇటీవల హైదరాబాద్ లో శాంతి భద్రతల పరిరక్షణపై విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. వాటి ఆరోపణలకు తగ్గట్టుగానే హైదరాబాద్లో పరిస్థితులు ఉన్నాయి. దీంతో రేవంత్ శ్రీనివాస్ రెడ్డిని పక్కనపెట్టి.. ఆనంద్ వైపు మొగ్గు చూపించారని తెలుస్తోంది. శ్రీనివాస్ రెడ్డి కంటే ఆనంద్ కు హైదరాబాద్ నగరం పై పట్టు ఎక్కువగా ఉంది. గతంలో ఆయనకు హైదరాబాద్ నగర కమిషనర్ గా పనిచేసిన అనుభవం కూడా ఉంది. పైగా హైదరాబాదులో శనివారం నుంచి గణపతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కొద్దిరోజుల్లోనే నిమజ్జనం ఉత్సవాలు నిర్వహించాల్సి ఉంటుంది. మరోవైపు రేవంత్ తన మానస పుత్రికగా అభివర్ణిస్తున్న హైడ్రా తీసుకుంటున్న నిర్ణయాలు రోజురోజుకు సంచలనం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కు స్థాన చలనం కలిగించి.. ఆ ప్లేస్ లో సివి ఆనంద్ ను రేవంత్ నియమించారు. శ్రీనివాస్ రెడ్డిని విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీగా నియమించారు. విజయ్ కుమార్ కు ఏసీబీ డీజీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. వీరు మాత్రమే కాకుండా త్వరలోనే మరికొందరు సీనియర్ అధికారులకు ఇలాగే స్థానచలనం కలిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

# అందరిని కాదని మహేష్‌గౌడే ఎందుకు...?

హైదరాబాద్: ఎట్టకేలకు తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త అధ్యక్షుడు నియమితులయ్యారు. పార్టీలో పలువురు సీనియర్లు పీసీసీ చీఫ్ పదవికి పోటీపడినా చివరికి మహేశ్‌కుమార్‌గౌడ్ వైపే కాంగ్రెస్ హౌకమాండ్ మొగ్గు చూపింది. బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకుడికి పార్టీ బాధ్యతలు అప్పగించడంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. కీలకమైన పీసీసీ అధ్యక్ష పదవీ బాధ్యతలు దక్కించుకోవడంలో మహేష్‌కు కలిసి వచ్చిన అంశాలేంటి? తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ నియమితులయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న ఆయనకు కాంగ్రెస్ హైకమాండ్ ప్రమోషన్ ఇచ్చింది. పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో విధేయతకే పార్టీ అధిష్ఠానం ప్రాధాన్యమిచ్చి ఆయనను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. 2021 జులై నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం పీసీసీ బాధ్యతల నుంచి తప్పించింది. బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌కి పీసీసీ బాధ్యతలు అప్పగించడంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత పొన్నాల లక్ష్మయ్య, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డిల అనంతరం 4వ పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో 2004 నుంచి 2014 మధ్యకాలంలో రెండు సార్లు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన డి.శ్రీనివాస్ ఉమ్మడి ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత అదే నిజామాబాద్ జిల్లాకు చెందిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు పార్టీపగ్గాలు అప్పగించడం విశేషం. గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేయడానికి మహేశ్‌కుమార్‌గౌడ్ టికెట్ ఆశించారు. అయితే కొన్ని సమీకరణాల వల్ల దక్కలేదు. కేసీఆర్ పోటీలో ఉండటంతో రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి కూడా పోటీ చేయడంతో.. మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆ స్థానం నుంచి తప్పుకొని నిజామాబాద్‌కు మారాల్సి వచ్చింది. దీంతో మహేశ్‌కుమార్ గౌడ్ అసెంబ్లీకి పోటీచేసే అవకాశం కోల్పోయారు. ఈ కారణంగానే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2024 జనవరిలో ఆయనను ఎమ్మెల్సీగా పార్టీ ఎంపిక చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉన్న మహేష్‌కు ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు ఆయనను పీసీసీ అధ్యక్షపీఠంపై కూర్చోబెట్టిందంటున్నారు. ఈ పదవి కోసం మాజీ ఎంపీ మధుయాస్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు పలువురు పోటీపడ్డారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో.. పార్టీ– ప్రభుత్వం మధ్య సమన్వయం అవసరం. అందుకే రేవంత్‌రెడ్డి ఏరికోరి ఆయనకు పదవి ఇప్పించుకున్నట్లు చెప్తున్నారు. విద్యార్థి రాజకీయాల నుంచి వచ్చి పార్టీనే అంటిపెట్టుకొని ఉండటం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమన్వయంతో పనిచేసుకుంటూ విధేయుడిగా ఉంటారనే పేరు పొందడం మహేష్‌కు కలసి వచ్చింది ? ప్రస్తుత మంత్రివర్గంలో బీసీలకు కేవలం 2 మంత్రి పదవులు మాత్రమే ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణలో బలమైన వర్గంగా గుర్తింపు పొందిన గౌడ్ వర్గానికి పెద్దపీట వేయాలన్న ఉద్దేశంతో అధిష్ఠానం మహేశ్‌కుమార్ గౌడ్ వైపు మొగ్గు చూపినట్లు రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. పీసీసీ చీఫ్ ఎంపిక అంకం ముగిసినందున.. రాష్ట్రంలో వరద పరిస్థితులు సద్దుమణిగి సాధారణ పరిస్థితులు నెలకొన్న అనంతరం మంత్రివర్గ విస్తరణ ఉండవచ్చని కాంగ్రెస్ నాయకులు అంచనా వేస్తున్నారు. రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్ కాంబినేషన్లో తెలంగాణలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

లోకల్ బాడీ సవాల్

స్థానిక సంస్థల ఎన్నికలే తన ముందున్న అతిపెద్ద సవాల్ అంటూ కుండబద్దలు కొట్టేశారు మహేష్ కుమార్ గౌడ్. సూటిగా సుత్తి లేకుండా తన టార్గెట్ ఏంటో ఫిక్స్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డితో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడుతూ, అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే లోకల్ బాడీ ఎన్నికలే తన ముందున్న సవాల్ అని అన్నారు. తన పదవి కోసం పోటీ చేసిన వారితోనూ కలిసి ముందుకెళ్తానని, అందర్నీ సమన్వయం చేసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లోనే టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకుంటానని, ప్రభుత్వానికి, పార్టీకి వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. త్వరలోనే కమిటీలను నియమిస్తామని, ఖాళీగా ఉన్న పార్టీ పదవులను భర్తీ చేస్తామని చెప్పారు. గత పేదళ్లుగా పార్టీనే నమ్ముకున్న వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు మహేష్ కుమార్ గౌడ్.

# ఖమ్మంలో మరోసారి డేంజర్ బెల్స్

ఖమ్మం: ఖమ్మంలో మరోసారి డేంజర్ బెల్స్ నెలకొన్నాయి. రాత్రి కురిసిన భారీ వర్షానికి మున్నేరు నదికి వరద పెరిగింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద పెరిగింది. రాత్రి కురిసిన భారీ వర్షానికి మున్నేరుకు వరద క్రమంగా పెరుగుతుంది. దాదాపు రాత్రి 8 అడుగుల నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం 16 అడుగులు దాటి ప్రవాహం వస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో శివారు కాలనీలను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. దానవాయి గూడెం, రామన్నపేట, ప్రకాష్ నగర్, మోతీనగర్ ముంపు ప్రాంతాల ప్రజలను అర్ధరాత్రి పునరావాస కేంద్రాలకు తరలించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజలు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. మరోవైపు, భారీ వర్షాలు, వరదలతో ప్రధాన నదులు పొంగిపొర్లుతున్నాయి. అయితే రాష్ట్రంలో రానున్న మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దాదాపు 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం వాయుగుండంగా మారనుంది. మూడు రోజుల పాటు వాయు గుండం కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాత్రి ఖమ్మం చేరుకున్నారు. వరద ప్రాంతాల్లో పర్యటించారు. మున్నేరు శివారు ప్రాంతంలోని ప్రజలను పరామర్శించారు. వరద ఉధృతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అలాగే, మున్నేరు నది లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం సహాయక చర్యల శిబిరాలను మళ్లీ తెరవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అర్ధరాత్రి భారీ వర్షాలు కురిశాయి. శనివారం రాత్రి 8.30 గంటల నుంచి అర్ధరాత్రి వరకు అత్యధికంగా మహబూబాబాద్‌లో 18.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఖమ్మంలో జిల్లా తల్లాడలో 12.2 సెం.మీ, రంగారెడ్డి జిల్లా చుక్కాపూర్‌లో 11.1సెం.మీ, అమనగల్‌లో 9.8, భద్రాద్రి జిల్లా చంద్రుగొండలో 9.3 సెం.మీల వర్షం కురిసింది. ఈ వర్షాలకు మున్నేరు నదితోపాటు పలు వాగులకు వరద ఉధృతి పెరిగింది. ఇదిలా ఉండగా, ఖమ్మం జిల్లా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటించనున్నారు. ఖమ్మంలోని 16వ డివిజన్ ధంసాలపురంలో వరద బాధితులను పరామర్శించనున్నారు. పాలేరు నియోజకవర్గంలోని తిర్మలాయపాలెం, రాకాసి తండాలో బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరద బాధితులకు కిషన్ రెడ్డి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయనున్నారు.

# పాత భవనాల జోలికి పోం

## హైడ్రా వివరణ

హైదరాబాద్: ఎఫ్టిఎల్ / బఫర్లో నిర్మించబడి, వ్యక్తులు ఆక్రమించినప్పటికీ, ఇల్లు/ నివాసం ఏదీ కూల్చివేయబడదు. అక్రమిత నివాసాలు/ నివాసాలు కూల్చివేయబడవని హైడ్రా వివరణ ఇచ్చింది. ఎఫ్టీఎల్ఒ/బఫర్లో వచ్చే కొత్త నిర్మాణాలు కూల్చివేయబడతాయి. మాదాపూర్ సున్నం చెరువు, దుండిగల్లోని మల్లంపేట్ చెరువులో ఈరోజు కూల్చివేసిన నిర్మాణాలు నిర్మాణంలో ఉన్నాయి మరియు ఎఫ్టిఎల్ / బఫర్ జోన్లలో అనుమతి లేకుండా వస్తున్నాయి. అమీన్పూర్లో కూల్చివేసిన నిర్మాణాలు ప్రధానంగా కాంపౌండ్ గోడలు/ గదులు/ షెడ్లు ఆక్రమణకు గురయ్యాయి. సున్నం చెరువులో నిర్మించిన కొన్ని షెడ్లు/హోటల్లు వాణిజ్యపరంగా వినియోగించి ఎఫ్టీఎల్లో పడి.. కూల్చివేశారు. ఏ వ్యక్తి ఆక్రమించిన ఇల్లు/నివాసం కూల్చివేయబడదు.

– మల్లంపేట చెరువు, దుండిగల్లో కూల్చిన 7 విల్లాలు ఇప్పటికీ నిర్మాణంలో ఉన్నాయి (ఏ కుటుంబాలు ఆక్రమించలేదు) మరియు భవన నిర్మాణ అనుమతులు లేకుండా ఎఫ్టిఎల్లో ఉన్నాయి... బిల్డర్ విజయలక్ష్మి పై అనేక క్రిమినల్ కేసులు బుక్ చేయబడ్డాయి. సున్నం చెరువులోని నిర్మాణాలు గతంలో కూడా కూల్చివేయబడ్డాయి... కానీ అవి మళ్లీ పైకి వస్తున్నాయి, అందుకే నేడు కూల్చివేయబడ్డాయి. బిల్డర్ విజయలక్ష్మి/ మాజీ ఎమ్మెల్యే పాణ్యం కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులపై స్థానిక పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు/ఫిర్యాదులు నమోదయ్యాయి. ఆక్రమించిన ఏ ఇళ్లు కూల్చబోమని హైదరాబాద్ ప్రజలందరికీ హామీ ఇస్తున్నాం. ఏదేమైనప్పటికీ, ఏదైనా సరస్సు యొక్క ఎఫ్టిఎల్ బఫర్ జోన్లో ఉన్న ఇల్లు/ఫ్లాట్/భూమిని కొనుగోలు చేయవద్దని మేము ప్రజలను అభ్యర్థిస్తున్నాము. అటువంటి ఆస్తుల కొనుగోలుదారులకు ఎఫ్టిఎల్ బఫర్ జోన్లకు సంబంధించి ఏదైనా సందేహం ఉంటే, వారు హెచ్ఎండీయే సరస్సులను (వెబ్సైట్) తనిఖీ చేయవచ్చు లేదా అలాంటి సందేహాలను నివృత్తి చేసుకోవడానికి మమ్మల్ని సంప్రదించవచ్చని హైడ్రా కమిషనర్ హైడ్రా వివరణ ఇచ్చారు.

# నిత్యవసర సరుకులు అధిక ధరలకు విక్రయిస్తే కేసు నమోదు చేస్తాం


**– కష్టకాలంలో అందరూ నిజాయితీగా పని చేయాలి**

**– ముక్కు ప్రాంతంలో ప్రతి కుటుంబానికి సరుకులు అందేలా చర్యలు**

**– పౌరసరఫల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామ ఆర్.సి.యం చర్చిలో, తుమ్మలపాలెం మరియు ఇబ్రహీంపట్నం ఫెర్రీలో ప్రభుత్వ ద్వారా అందించే నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కష్టకాలంలో అందరూ నిజాయితీతో బాధ్యతగా పనిచేయాలని కోరారు. ముంపు ప్రాంతాలలో ప్రతి కుటుంబానికి సరుకులు అందే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఎవరు ఇబ్బంది పడవలసిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికి సరుకులు అందజేస్తామని తెలిపారు. నిత్యవసర సరుకులను వ్యాపారస్తులు ఎంఆర్పి రేటుకు మించి అమ్మితే కేసులో నమోదు చేస్తా మని తెలిపారు. ఇప్పటికే విజయవాడ పరిధిలో లీగల్ టీం ద్వారా దాడులు నిర్వహిస్తున్నామని, ఇబ్రహీంపట్నంలో కూడా టీం చర్యలు తీసుకుంటుందని మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నకు సమాధానం గా చెప్పారు. ఇది కష్ట కాలమని ఈ సమయంలో అందరూ నిజాయితీగా పనిచేయలని, బాధితులకు మరింత ఇబ్బంది పదేవిధంగా వ్యవహరిం చడం తగదని హెచ్చరించారు. జనసైనికులు అందరూ బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆందోళనవద్దు .. అప్రమత్తతే మందు



**- వైరల్ జ్వరం వచ్చినా రక్తఫలకికల్లో తగ్గుదల**
**- జాగ్రత్తలు పాటిస్తే త్వరగానే ఆరోగ్యం**
**- జిల్లాలో నేటికీ 341 డెంగీ..12372 వైరల్ కేసుల నమోదు**

నల్లగొండ: నల్లగొండ జిల్లావ్యాప్తంగా వైరల్ జ్వరాల కారణంగా రోగుల్లో రక్తఫలకికలు తగ్గుతున్నాయి. డెంగీగా భావించి చాలా మంది ఆందోళన చెందుతున్నారు. తెల్లరక్తకణాలు (ప్లేట్లెట్స్) సంఖ్య తక్కువైన వేళ తీవ్రంగా ఆలోచించి సమస్యను జఠిలం చేసుకుంటున్నారు. సకాలంలో జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

శరీరానికి ఎంతో దోహదం

రక్తఫలకికల్లో ఒకటైన తెల్లరక్తకణాలు(ప్లేట్ లెట్స్) వ్యాధి నిరోధకాలుగా పని చేస్తూ శరీరం రోగాలమయం కాకుండా కాపాడుతుంటాయి. ఎర్ర రక్తకణాల్లో ఉండే హిమోగ్లోబిన్ ద్వారా శరీరం మొత్తానికి అవసరమైన ప్రాణ వాయువు అందుతుంది. రక్తఫలకికల్లో కొన్ని శరీరానికి గాయం అయినప్పుడు రక్తం గడ్డ కట్టడానికి తోడ్పడుతాయి. ఇలా రక్తఫలకికలు నిత్యం తమ పాత్రను సక్రమంగా పోషిస్తుండడంతో ఆరోగ్యంగా జీవించగలుగుతాం.

1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు

రక్తఫలకికలు కేవలం 10 రోజులు మాత్రమే శరీరంలో నివసిస్తాయి. ఎముక మజ్జ ప్రతి రోజూ మిలియన్ల ఫలకికలను ఉత్పత్తి చేస్తుంది. ఒక మైక్రోలీటర్ రక్తంలో సాధారణంగా 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు ఫలకికలు ఉంటాయి. మహిళ లలో ఈ సంఖ్య1.57 లక్షల నుంచి 3.71 లక్షల వరకు ఉంటుందని నిర్ధారించారు.

40 వేలకు దిగువన అయితే రక్తస్రావమే

రక్తంలో ఫలకికల సంఖ్య 40 వేలకు దిగు వన ఉంటే.. రక్తనాళాల్లో రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుంది. ఒక మైక్రోలీటర్ రక్తంలో సాధారణంగా 20 వేల కన్నా ఫలకికలు తక్కువగా ఉంటే తీవ్రమైన థ్రోంబోసైటోపెనియా వస్తుంది. అంతర్గతంగా ఇది తీవ్ర రక్తస్రావాలకు దారి తీస్తుంది. ప్రాణాలకు ప్రమాదం కలిగే ఆస్కారం ఉంది.

2 రోజుల్లో పెంచుకోవచ్చు

ఒక వ్యక్తి 2 రోజుల్లో వారి రక్తఫలకికలను పెంచుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తినాలి. మొత్తం శరీరానికి ఫోలేట్ లేదా విటమిన్ బీ12 అధికంగా ఉండే ఆహారాన్ని తినడం ద్వారా సహజంగా ఫలకికలు పెరుగుతాయి. దీనికి తోడు బొప్పాయి, కొబ్బరి నీళ్లు అధికంగా తీసుకోవాలి. దానిమ్మ, ఎండు ద్రాక్ష, కివీ పళ్లను ఎక్కువగా స్వీకరించాలి. అన్ని జ్వరాలను డెంగీగా పరిగ ణించలేమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వైరల్ ఫీవర్ కారణంగా కూడా రక్త పలికికల్లో తేడా వస్తుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మళ్లీ మూడు రోజుల్లో రక్తంలో ఫలకి కలు వృద్ధి చెందే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

# గృహ నిర్మాణ 100 రోజుల లక్ష్యాల పూర్తిపై దృష్టిపెట్టండి..

**- మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు సమన్వయ శాఖల అధికారులు కృషిచేయాలి.**
**- వరద ప్రభావిత ప్రాంతాల్లో గృహ నిర్మాణ అధికారులు సిబ్బంది సేవలు భేష్.**
**- రాష్ట్ర గృహ నిర్మాణం; సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన వందరోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణం; సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఆదివారం మంత్రి కొలుసు పార్థసారథి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన ప్రగతిపై సమీక్షించారు. వందరోజుల ప్రణాళిక కింద నిర్దేశించిన లక్ష్యాలు, వాటి సాధనలో పురోగతిని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (గృహ నిర్మాణం) అజయ్ జైన్ వివరించారు. అదేవిధంగా మొత్తం మంజూరైన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వివరాలను ఏపీ ఎస్ హెచ్ సి ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజాబాబు వివరించగా.. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన వివరాలను గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి పేదలకు ఇళ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని వచ్చే మార్చి నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 20,48,270 ఇళ్లు మంజూరు కాగా.. వీటిలో 6,82,056 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 13,66,214 ఇళ్లలో 5,71,153 ఇళ్లు ప్రారంభించని (నాట్ స్టార్టెడ్) దశలో ఉన్నాయన్నారు. ఈ నిర్మాణాలను త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు అధికారులకు క్షేత్రస్థాయిలో సందర్శించి పనులను వేగవంతం చేసేందుకు కృషి చేయాలి అన్నారు. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఉంటే యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి పనుల్లో జాప్యం లేకుండా చేయాలన్నారు. లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంలో చేయిపట్టి నడిపించాలన్నారు. అదేవిధంగా కాలనీల్లో మౌలిక వసతులు కల్పనపై కూడా దృష్టిసారించి మంజూరు చేసిన పనుల పూర్తికి ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. రహదారుల ఏర్పాటుకు సంబంధించి పంచాయతీరాజ్ అధికారులతోనూ, మంచినీటి సరఫరాకు సంబంధించి గ్రామీణ నీటి సరఫరా అధికారులతోనూ కలిసి పనిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జల జీవవ్ మిషన్ కింద మంజూరు చేసిన పనులను పూర్తిచేయాలని, అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో అమృత్ పథకం కింద పనులు చేపట్టేలా పురపాలక సంఘ అధికారులతోనూ సమన్వయం చేసుకోవాలన్నారు.ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ వాటి ప్రభావం లేని పనుల పూర్తికి కృషిచేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యల్లో భాగస్వామ్యం అవుతున్న గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బందిని మంత్రి పార్థసారథి ప్రశంసించారు.

# అన్నదాత పట్ల ప్రభుత్వంది వంచన

హైదరాబాద్: మాజీ మంత్రి ,ఎమ్మెల్యే టి .హరీష్ రావు , ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ,ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. హరీష్ రావు మాట్లాడుతూ ఈ ప్రెస్ మీట్ బాధతో ,దుఃఖం తో పెట్టాల్సి వస్తోంది. అన్నదాత పట్ల ప్రభుత్వంది వంచన. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలన రైతుల పట్ల యమపాశంగా మారింది. మేడ్చల్ లో వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు లేఖ రాసి మరీ సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. సురేందర్ రెడ్డి కి గ్రామీణ బ్యాంక్ లో అప్పు ఉంది. ..సురేందర్ రెడ్డి అమ్మకు లక్షా 15 వేలు ,సురేందర్ రెడ్డి కి లక్షా 92 వేలు అప్పు ఉంది. బ్యాంకు మేనేజర్ అనిరుద్ కుటుంబ సభ్యుల్లో ఒక్కరికే రుణమాఫీ అవుతుందని చెప్పడం తో సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. సురేందర్ రెడ్డి ఆత్మహత్య లేఖ లోని ప్రతి అక్షరం రేవంత్ రెడ్డి ని నగ్న స్వరూపాన్ని బయటపెట్టింది. రేవంత్ రెడ్డి పూటకో మాట పొద్దు తిరుగుడు కంటే వేగంగా మారుతోంది. రేషన్ కార్డు లింకు లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పావ్. సురేందర్ రెడ్డి ఆత్మహత్య రేషన్ కార్డుకు రైతు రుణ మాఫీకి ఉన్న లింక్ ఉన్నదని నిరూపితం అయ్యిందని అన్నారు. రేవంత్ పాలనకు సురేందర్ రెడ్డి లేఖ ఓ పంచనామా లాంటిది. రైతు రుణమాఫీ ఆంక్షలతో రేవంత్ కుటుంబ బంధాల్లో చిచ్చు పెట్టారు. కేసీఆర్ కుటుంబ బంధాలు బలోపేతం చేస్తే వాటిని విచ్చిన్నం చేసిన దరిద్రపు గొట్టు ప్రభుత్వం రేవంత్ ప్రభుత్వం . నా నియోజకవర్గం లో జక్కాపూర్ గ్రామం లో గురజాల బాల్ రెడ్డి కుటుంబం లో ముగ్గురికి రుణం ఉంది. వారికి ఆరు లక్షల అప్పు ఉంటె కేవలం రెండు లక్షలే మాఫీ అవుతోంది. ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. ఇది రైతుల పాలిట రేవంత్ చేసిన మోసం ,దగా కాదా ? .రైతు రుణ మాఫీ ఎగ్గొట్టడానికి రేవంత్ ప్రభుత్వం 31 సాకులు చూపెడుతోంది. నారాయణ్ పేట గ్రామం లో నల్ల మణెమ్మ అనే రైతుకు లక్ష రూపాయల అప్పు ఉంది. ఆమె భర్త 2010 లో మరణించారు ..ఆయన ఆధార్ కార్డు తెస్తేనే రుణ మాఫీ చేస్తామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. 2010 లో ఆధార్ కార్డు యే ఇవ్వనప్పుడు ఆధార్ కార్డు ఎలా తెస్తారు ? .కుంభాల సిద్ధారెడ్డి ,చాట్ల హరీష్ అనే రైతులకు భార్యల ఆధార్ కార్డులు తెమ్మంటున్నారు ..వారికి పెళ్లిళ్లే లేవు ..ఆధార్ కార్డులు ఎక్కడ్నుంచి తెస్తారని అన్నారు. ఇలాంటి వాళ్ళు ఎంత మందో ఉన్నారు ..రుణ మాఫీ కోసం వాళ్ళు పెళ్లిళు చేసుకోవాలా ? 20 లక్షల మందికే ఇప్పటిదాకా రుణ మాఫి అయ్యింది ...21 లక్షల రైతుల మంది కి ఇంకా కావాలని అన్నారు.

రుణ మాఫీ అయ్యింది నన్ను బావిలో దూకమని రేవంత్ అంటున్నారు

# ఇది కష్టసమయం ప్రజలు ధైర్యంగా ఉండాలి

ఖమ్మం: ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆదేశాలతో మిమ్మల్ని కలవడానికి మిమ్మల్ని పరామర్శించి ఇక్కడ పరిస్థితుల్ని పరిశీలించడానికి వచ్చాను. రాకాసితండా ప్రజలు వరద కారణంగా సర్వస్వం కోల్పోయారు నిరాశ్రయులుగా మిగిలారు. పంట పొలాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి పొలాలన్నీ ఇసుక మేటలుగా మారాయి. ఈ కష్ట సమయంలో ఈ గ్రామస్తులకు అండగా నిలవలసిన అవసరం ఉంది గ్రామస్తులు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు . ప్రజల కోరిక మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరి ఆమోదం మేరకు రాకాసితండాను సురక్షిత ప్రాంతానికి మార్చే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పంట పొలాల్లో ఇసుక మేటను తొలగించి ఆర్థిక సాయం అందించి రైతులు సాగు చేసుకునే విధంగా చేయాలి.

ఇది కష్ట సమయం ప్రజలు ధైర్యంగా ఉండాలి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరద బాధితులకు అండగా ఉంటాయి.. మిమ్మల్ని ఆదుకునే బాధ్యత ప్రభుత్వాలు తీసుకుంటాయని అన్నారు

# యూఎస్ ఓపెన్ టైటిల్ గెలిచిన సిన్నర్..




న్యూయార్క్: యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను జాన్నిక్ సిన్నర్ గెలిచాడు. ఫైనల్లో అతను టేలర్ ఫ్రిట్జ్‌పై 6-3, 6-4,7-5 స్కోరు తేడాతో విజయం సాధించాడు.

నెంబర్ వన్ ర్యాంక్ ప్లేయర్ సిన్నర్.. తన బేస్‌లైన్ గేమ్‌తో ఆకట్టుకున్నాడు. ఇటీవల డ్రగ్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలినట్లు సిన్నర్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. 23 ఏళ్ల ఇటలీ ప్లేయర్ సిన్నర్.. తన కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ సాధించాడు. ఈ ఏడాది జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ కూడా గెలిచాడతను. యూఎస్ ఓపెన్‌లో అమెరికా టెన్నిస్ ప్లేయర్ టైటిల్ గెలిచే అవకాశాన్ని సిన్నర్ అడ్డుకున్నాడు. 21 ఏళ్లుగా యూఎస్ ఓపెన్‌లో అమెరికా ప్లేయర్‌కు టైటిల్ దక్కలేదు.

డోపింగ్ వివాదం..

యూఎస్ ఓపెన్ టోర్నీకి ఆరు రోజుల ముందు మాత్రమే సిన్నర్‌కు డోపింగ్ పరీక్ష నుంచి క్లియరెన్స్ దక్కింది. రెండు సార్లు జరిపిన పరీక్షల్లో అతనికి స్వల్ప స్థాయిలో క్లోస్టెబోల్ స్టిరాయిడ్ ఉన్నట్లు తేలింది. ఫిజియోథెరపిస్ట్ అనుకోకుండా ఇవ్వడం వల్ల సిన్నర్‌లో స్టిరాయిడ్ ఉన్నట్లు తెలిసిందని ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ పేర్కొన్నది. యూఎస్ ఓపెన్ టైటిల్ తనకు ఎంతో ముఖ్యమైందని, ఎందుకంటే కెరీర్‌లో గడిచిన కొన్ని రోజులు కష్టంగా సాగినట్లు సిన్నర్ తెలిపాడు. టోర్నీ ఆడుతున్న సమయంలో డోప్ పరీక్షలకు చెందిన ఆలోచనలే వచ్చేవన్నారు.

డోపింగ్ వివాదం తర్వాత ఫిజియో, ఫిట్‌నెస్ ట్రైనర్ నుంచి సిన్నర్ దూరం అయ్యాడు. ఆ ఇద్దర్నీ వదులుకున్నాడు. టెన్నిస్ క్రీడల్లో బిగ్ ఫోర్‌గా పిలిచే రోజర్ ఫెదరర్, రఫేల్ నాదల్, జోకోవిడ్, ముర్రే లేకుండానే ఈ ఏడాది యూఎస్ ఓపెన్ ముగిసింది. 2002 తర్వాత ఈ నలుగురు లేకుండా గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలవడం ఇదే మొదటిసారి. అయితే ఈ ఏడాది సిన్నర్, అల్కరాజ్‌లు చెరో రెండు గ్రాండ్‌స్లామ్‌లు సొంతం చేసుకున్నారు.

# 20 నెలల తర్వాత.. టెస్టులలో రిషభ్ రీఎంట్రీ

**బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు భారత జట్టు ప్రకటన**



ముంబై: రెండేండ్ల క్రితం కారు ప్రమాదంలో గాయపడి గతేడాది పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పునరాగమనం చేసిన భారత స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ సుమారు 20 నెలల తర్వాత టెస్టు జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు.

బంగ్లాదేశ్‌తో ఈనెల 19 నుంచి చెన్నై వేదికగా జరుగబోయే తొలి టెస్టుకు ప్రకటించిన జట్టులో అతడు చోటు దక్కించుకున్నాడు. ఈ మేరకు ఆదివారం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని జాతీయ సెలక్షన్ కమిటీ రోహిత్ శర్మ సారథ్యంలోని 16 మంది సభ్యుల భారత జట్టును ప్రకటించింది.

ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ తిరిగి జట్టుతో చేరనుండగా టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత ఏస్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సైతం చెన్నై టెస్టులో ఆడనున్నాడు. దులీప్ ట్రోఫీలో ఆకట్టుకుంటున్న యూపీ పేసర్ యశ్ దయాళ్ సర్‌ప్రైజ్ ప్యాకేజీగా జట్టులోకి వచ్చాడు. సీనియర్ పేసర్ షమీకి నిరాశ తప్పలేదు.

తొలి టెస్టుకు భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, యశ్ దయాళ్

# నవదీప్ పసిడి త్రో

**- జావెలిన్ త్రోలో బంగారు పతకం**
**- 200మీ రేసులో సిమ్రన్‌కు కాంస్యం**
**- పారిస్ 2024 పారాలింపిక్స్**



పారిస్: 2024 పారాలింపిక్స్‌లో భారత జోరు కొనసాగుతుంది. పోటీల చివరి రోజు సైతం భారత పారా అథ్లెట్లు పతక వేటలో అసమాన ప్రదర్శన చేశారు. జావెలిన్ త్రోలో నవదీప్ సింగ్ బంగారు పతకం గెల్చుకోగా.. 200 మీటర్ల పరుగు పందెంలో సిమ్రన్ శర్మ కాంస్య పతకం సొంతం చేసుకుంది. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ ఇప్పటివరకు 29 పతకాలు సొంతం చేసుకుని.. పారాలింపిక్స్ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది.

నవదీప్.. సూపర్ త్రో


2020 టోక్యో పారాలింపిక్స్ నవదీప్ సింగ్‌కు తీరన వ్యథ మిగిల్చింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 విభాగంలో నవదీప్ సింగ్ నాల్గో స్థానంలో నిలిచాడు. కాంస్య పతకం సాధించిన ఇరాక్ పారా అథ్లెట్ విల్డన్ 41.39 మీటర్ల త్రోతో మూడో స్థానంలో నిలువగా.. 40.80 మీటర్ల త్రోతో నవదీప్ సింగ్ నాల్గో స్థానంలో నిలిచాడు. సెంటమీటర్ల వ్యత్యాసంతో పారాలింపిక్స్ పతకానికి దూరమయ్యాడు. మూడేండ్ల తర్వాత పారిస్ పారాలింపిక్స్‌లో కథ మార్చివేశాడు నవదీప్. టోక్యోలో జరిగిన దానికి పూర్తి భిన్నంగా పారిస్‌లో జరిగింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 విభాగంలో నవదీప్ సింగ్ నిజానికి రెండో స్థానంలో నిలిచాడు. 47.32 మీటర్ల త్రోతో సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. కానీ ఇరాన్‌కు చెందిన పారా అథ్లెట్ 47.64 మీటర్ల దూరంతో బంగారు పతకం సాధించాడు. కానీ పసిడి సాధించిన ఆనందంలో అతడు పారాలింపిక్స్ క్రీడల నిబంధనలకు విరుద్ధంగా గుర్తింపు లేని రాజ్యం జాతీయ పతాకం ప్రదర్శించటంతో అతడిపై అనర్హత వేటు వేశారు. దీంతో రెండో స్థానంలో నిలిచిన నవదీప్ సింగ్‌కు బంగారు పతకం దక్కింది. డిఫెండింగ్ చాంపియన్, చైనా పారా అథ్లెట్ సన్ కాంస్య పతకాన్ని సిల్వర్ మెడల్ చేసుకోగా.. నాల్గో స్థానంలో నిలిచిన నుకుల్‌వారు కాంస్య పతకం సాధించాడు. 23 ఏండ్ల నవదీప్ సింగ్ తొలినాళ్లలో జావెలిన్‌పై మక్కువ చూపించలేదు. తండ్రి దల్బీర్ సింగ్ బాటలోనే నడిచి రెజ్లింగ్‌లో సాధన చేశాడు. జాతీయ స్థాయిలో కొన్ని టోర్నమెంట్లలోనూ పోటీపడ్డాడు. కానీ మరో పారా జావెలిన్ త్రోయర్ సందీప్ చౌదరిని చూసి స్ఫూర్తి పొందిన నవదీప్ సింగ్ జావెలిన్ త్రోను కెరీర్‌గా ఎంచుకున్నాడు. నాలుగు అడుగుల నవదీప్ సింగ్‌కు ఆరంభంలో ఏడు అడుగుల జావెలియన్‌ను పట్టుకోవటం కాస్త ఇబ్బందిగా ఉండేది. కానీ ఒక్కసారి సాధన షురూ చేశాక ఎక్కడా వెనక్కి తగ్గలేదు. 2024 పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా పసిడి పతకంతో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

సిమ్రన్.. కాంస్య పరుగు

ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత్‌కు మరో మెడల్ లభించింది. మహిళల 200 మీటర్ల టీ12 విభాగం ఫైనల్లో సిమ్రన్ శర్మ కాంస్య పతకం సాధించింది. ఈ విభాగంలో వరల్డ్ చాంపియన్‌గా పతక వేటకు బరిలోకి దిగిన సిమ్రన్ శర్మ.. తొలి ప్రయత్నంలోనే పారాలింపిక్స్ పతకం సొంతం చేసుకుంది. 100 మీటర్ల టీ12 విభాగం ఫైనల్లో నాల్గో స్థానంలో నిలిచి 0.05 సెకండ్ల తేడాతో పతకం చేజార్చుకున్న సిమ్రన్ శర్మ.. 200 మీటర్ల విభాగంలో మెడల్ పోడియంపై నిలిచింది. 24.75 సెకండ్లలో రేసును పూర్తి చేసిన సిమ్రన్ శర్మ..భారత పతకాల సంఖ్యను 29కు మెరుగుపర్చింది. క్యూబా పారా స్ప్రింటర్ ఓమర 23.62 సెకండ్లతో బంగారు పతకం గెల్చుకుంది. వెనుజులా పారా స్ప్రింటర్ లోపెజ్ సిల్వర్ మెడల్ సాధించింది.

# చాంపియన్ సబలెంకా

**- మహిళల సింగిల్స్ టైటిల్ కైవసం**
**- ఫైనల్లో జెస్సికా పెగులాపై గెలుపు**
**- యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్**



న్యూయార్క్: మహిళల సింగిల్స్ టైటిల్‌ను రెండో సీడ్ బెలారస్ స్టార్ అర్యాన సబలెంకా సొంతం చేసుకుంది. సుమారు రెండు గంటల పాటు సాగిన ఉత్కంఠభరిత టైటిల్ పోరులో సబలెంకా కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఆరో సీడ్ అమెరికా అమ్మాయి జెస్సికా పెగులాపై 7-5, 7-5తో వరుస సెట్లలో విజయం సాధించింది. తొలిసారి యు.ఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ కిరీటం దక్కించుకుంది. సబలెంకా కెరీర్‌లో ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ విజయం కాగా.. ఈ సీజన్‌లోనే రెండోది. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించిన సబలెంకా టెన్నిస్ ఓపెన్ చరిత్రలో ఓ సీజన్‌లో రెండు హార్డ్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (ఆస్ట్రేలియన్, యు.ఎస్ ఓపెన్) సాధించిన ఐదో క్రీడాకారిణిగా నిలిచింది. ఆద్యంతం ఉత్కంఠ: మహిళల సింగిల్స్ ఫైనల్ అంచనాలకు భిన్నంగా సాగింది. తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో పోటీపడిన జెస్సికా పెగులా కండ్లుచెదిరే పోరాట పటిమ చూపించింది. ఆఖరు పాయింట్ వరకు గట్టి పోటీ ఇచ్చింది. రెండు గంటల టైటిల్ పోరులో సబలెంకా ఎక్కడా సులువుగా పాయింట్లు సాధించలేదు. ప్రతి పాయింట్ కోసం చెమటోడ్చక తప్పలేదు. నెట్ గేమ్ వద్ద పెగులాపై పైచేయి సాధించిన సబలెంకా.. ఫైనల్లో విజయం సాధించింది. నెట్ వద్ద సబలెంకా 18 పాయింట్లు సాధించగా.. పెగులా కేవలం ఐదు పాయింట్లు సాధించింది. సబలెంకా రెండు సెట్లలో ఏకంగా ఆరు సార్లు పెగులా సర్వ్‌ను బ్రేక్ చేసింది. పెగులా సైతం నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించినా.. సబలెంకాపై పైచేయి సాధించటంలో విఫలమైంది. సబలెంకా ఆరు ఏస్‌లు కొట్టగా.. జెస్సికా నాలుగు ఏస్‌లు సంధించింది. విన్నర్ల పరంగా సబలెంకా 40 విన్నర్లు గెలుపొందగా.. జెస్సికా 17 విన్నర్లను మాత్రమే గెల్చుకుంది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**